
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పల్నాడు జిల్లా వార్తలు

5

గురువారం 20 నవంబరు 2025





కొనుగోళ్లు

- హాయ్ అంటే ఏఐ సహకారం
- సేకరణను సులభతరం చేసే దిశగా అడుగులు
- బాపట్ల, గుంటూరు జిల్లాల్లో కేంద్రాలు ప్రారంభం
- నెలాఖరు నుంచి పల్నాడు జిల్లాలో కొనుగోళ్లకు ఏర్పాట్లు

రైతుల కోసం వాట్సాప్ నెంబర్ 73373 59375

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ధాన్యం కొనుగోళ్లను సులభతరం చేసే దిశగా ప్రభుత్వం సాంకేతిక సేవలను ఉపయోగించుకునే విధానానికి తెరతీసింది. రైతుల కోసం వాట్సాప్ నెంబర్‌ను అందుబాటులోకి తెచ్చింది. 7337359375 నంబరుకు హాయ్ అని మెసేజ్ పెడితే చాలు వెంటనే ఆర్టిఫిషియల్ ఇంటిలెజెన్స్ వాయిస్‌తో తదుపరి ప్రక్రియపై రైతులకు మార్గనిర్దేశనం చేస్తుంది. అన్నదాతలు వాట్సాప్ వేదికగా ఇచ్చే వివరాలతో కొనుగోలు స్లాట్ బుక్ కానుంది. వాట్సాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకునే రైతుల ధాన్యాన్ని కొనుగోలు నుంచి వారి ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేవరకు సాంకేతిక బృందం పర్యవేక్షణ కొనసాగనున్నది. ఓ వైపు కొనుగోలు కేంద్రాలను తెరుస్తూనే, మరో వేదికగా వాట్సాప్ సేవలను కూడా రైతులకు ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. మద్దతు ధరకు (మిగతా 6వ పేజీలో)

పల్నాడులో 286 కేంద్రాలు

ఈ నెలాఖరు నుంచి పల్నాడు జిల్లాలో ధాన్యం సేకరణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 286 రైతు సేవా కేంద్రాల ద్వారా 40,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించనున్నారు. మూడు జిల్లాల పరిధిలోనూ గతేడాది ఖరీఫ్ సీజన్‌తో పోలిస్తే కొనుగోళ్ల లక్ష్యాన్ని దాదాపుగా రెట్టింపు చేయడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గుంటూరులో లక్ష టన్నులు

గుంటూరు జిల్లాలో బుధవారం నుంచి కొనుగోళ్లకు శ్రీకారం చుట్టారు. తొలుత 5 రైతు సేవా క్లస్టర్లను ఓపెన్ చేసి, వారం వ్యవధిలో 45 క్లస్టర్లలో కొనుగోళ్లు జరిపేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. జిల్లాలో మొత్తం దిగుబడి దాదాపు మూడు లక్షల టన్నుల వరకు ఉంటుందనే అంచనాల నేపథ్యంలో లక్ష టన్నుల వరకు సేకరించేలా ప్రస్తుతం ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

లెక్కే లేదు అమలు ఇంకెక్కడ?



- మొక్కుబడిగా వీధి కుక్కల బెడద నియంత్రణ
- 'స్థానిక'ంగా పక్కాగా లేని శునకాల లెక్క
- స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ అంతంత మాత్రమే..
- సుప్రీం గడువు దాటినా..కమిటీలతోనే సరి..
- అలసత్వం, ఆటంకాలు, నిధుల కొరత..



సత్తెనపల్లి: కుక్కకు వ్యాక్సిన్ వేస్తున్న పశు వైద్యుడు



సత్తెనపల్లిలో వ్యాక్సిన్ సెంటర్

నరసరావుపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణాల్లో వీధి కుక్కలు ఇంకా రోడ్లపై గుంపులుగా చేరి మొరుగుతూనే ఉన్నాయి. జనం పిక్కల బలానికి పరీక్షలు పెడుతూనే ఉన్నాయి. కుక్కకాటుతో ఆసుపత్రులను ఆశ్రయిస్తున్న వారి సంఖ్యలో పెద్దగా మార్పేమీ కనిపించడం లేదు. వీధి కుక్కల కారణంగా ఎవరి ప్రాణాలకు హాని కలగకూడదని, వాటి నియంత్రణ, జన సమూహాల్లో సంచారం లేకుండా చూడాలంటూ సుప్రీం కోర్టు ఇచ్చిన రెండు వారాల గడువు పూర్తయిపోయింది. చర్యలు తీసుకోకపోతే ఆయా రాష్ట్రాల సీఎస్‌లనే బాధ్యులను చేస్తామని కూడా స్పష్టం చేసింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో పరిశీలిస్తే.. ఒకటి, రెండు పురపాలికల్లో మినహా కుక్కల నియంత్రణకు తీసుకున్న చర్యలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. స్టెరిలైజేషన్, ఆహారం అందించేందుకు ఒక్కో వీధి కుక్కకు రూ.1,650 ఖర్చు చేయాలని, ప్రత్యేక కమిటీల సాయంతో వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలంటూ (మిగతా 8వ పేజీలో)



వీధి కుక్కలను పట్టుకునేందుకు ప్రత్యేక శిక్షణ ఉన్న సిబ్బంది అన్ని మున్సిపాలిటీలకు అందుబాటులో లేరు. తెనాలి, పొన్నూరు, బాపట్ల, రేపల్లె పట్టణాల్లో వీధి కుక్కలను పట్టుకోవాలంటే మంగళగిరి ప్రాంతంలో ఉన్న కొద్దిమంది డాగ్ హ్యాండ్లర్లు, క్యాచర్లను ఆశ్రయించాలి. రాష్ట్ర మున్సిపల్ శాఖ శిక్షణ పొందిన డాగ్ క్యాచర్లను నియమించుకోవాలని ఆదేశాలిచ్చినా నియామకాలు జరగలేదు.

ఆపరేషన్లు చేశాక వీధి కుక్కలను కనీసం నాలుగు రోజులు అదే కేంద్రాల్లో సంరక్షించాల్సి ఉంది. కొన్ని మున్సిపాలిటీల్లో నిధుల కొరత ఉంటే, మరికొన్నింటిలో వాటికి వెచ్చించాల్సిన నిధులు మింగేసిన పరిస్థితి ఉంది. దీంతో కొన్ని కేంద్రాల్లో ఉంచిన కుక్కలు అక్కడే చనిపోయిన దారుణ పరిస్థితులూ ఉన్నాయి. ఇందుకోసం.. మున్సిపల్ సాధారణ నిధుల నుంచి ఖర్చు చేయాలని రాష్ట్ర పురపాలక శాఖ ఆదేశించింది. ఏ మున్సిపాలిటీలోనూ నిధుల మిగులు లేవు.

పత్తి కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- రైతులకు ఎలాంటి ఇబ్బంది రాకూడదు
- సీసీఐ కేంద్రం పరిశీలనలో కలెక్టర్ కృతికాశుక్లా

సత్తెనపల్లి రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పత్తి కొనుగోళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ కృతికాశుక్లా ఆదేశించారు. పట్టణంలోని లక్ష్మీ కాటన్ ట్రేడింగ్ కంపెనీలో ఏర్పాటు



పత్తిలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆమె సందర్శించారు. కేంద్రానికి వచ్చిన పత్తిని, కొనుగోళ్ల తీరును కలెక్టర్ పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తేమ శాతం ఒకటి అర ఎక్కువగా ఉన్నా కొనుగోలు చేయాలని బయ్యర్‌ను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్లు చేయాలన్నారు. రైతులు కేంద్రానికి తెచ్చిన పత్తిని ఏరోజు కారోజు కొనుగోలు చేయాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి, తహసీల్దార్ కేఎస్ చక్రవర్తి, మార్కెట్ యార్డు చైర్మన్ కొమటినేని శోభారాణి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి కొమటినేని శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- ఊడిచర్ల కాలనీవాసులతో డీఎంహెచ్‌వో రవికుమార్

ఈపూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వ్యాధులు దరిచేరకుండా ఉండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఎంహెచ్‌వో రవికుమార్ తెలిపారు. మండలంలోని ఊడిజర్ల ఎస్సీ కాలనీలో కొనసాగుతున్న వైద్య శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించారు. కాలనీలో ఇంటింటికి వెళ్లి పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. వైద్య సిబ్బందితో మాట్లాడి రోగుల వివరాలు తెలుసుకున్నారు. డెంగీ జ్వరాలతో బాధపడుతున్న కాలనీవాసులు గుంటూరు, నరసరావుపేట ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలుసుకున్నారు. ఆర్వో ప్లాంట్‌లో నిబంధనలు పాటిస్తున్నారా లేదని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మరో నాలుగు రోజులు కాలనీలో వైద్య శిబిరం నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దోమతెరలు తప్పనిసరిగా వినియోగించుకోవాలన్నారు. డ్రైయిన్లను బాగు చేసుకోవాలన్నారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కాచిచల్లార్చిన నీటిని మాత్రమే తాగాలన్నారు. ఆయన వెంట వైద్యాధికారి నజీర్, డాక్టర్ సుచరిత, పీ.హెచ్.ఎం లక్ష్మీనరసమ్మ, ఏఎన్ఎం విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

మహిళల జీవనశైలిలో మార్పులు రావాలి

వీవోఏలు కృషి చేయాలన్న ఏపీడీ రాజాప్రతాప్



శిక్షణ ఇస్తున్న ఏపీడీ రాజాప్రతాప్

శావల్యాపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలు జీవనశైలిలో మార్పులు చేసుకుని కుటుంబ జీవన ప్రమాణాన్ని మెరుగుపరుచుకునేలా వీవోఏలు, గ్రామసంఘ అధ్యక్షులు కృషి చేయాలని ఏపీడీ రాజాప్రతాప్ తెలిపారు. స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో వీవోఏలు, గ్రామసంఘాల అధ్యక్షులకు బుధవారం ఎంసీఎల్ఎఫ్ శిక్షణా కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, పశుపోషణ, సుస్థిర జీవనోపాధి, సామర్థ్యం పెంపు తదితర అంశాల్లో జిల్లాలో ఎంపిక చేసిన పది మోడల్ మండలాల్లో ఎంసీఎల్ఎఫ్ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని అలవర్చుకునేలా డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు గోనుగుంట్ల భార్గవి, కార్యదర్శి కుమారి, ఇన్‌చార్జి ఏపీఎం రామారావు, సీసీలు కరుణమ్మ, మేరీకుమారి, అకౌంటెంట్ వెంకాయమ్మ పాల్గొన్నారు.

శబరిమలలో గుండెపోటుతో ఇప్పటం వాసి మృతి
- మంత్రి లోకేశ్ సహకారంతో గ్రామానికి మృతదేహం

న్యూ కేటగిరి విజేత ప్రకాశం జిల్లా ఎడ్ల జత

ఔషధాల తయారీలో ఫార్మసిస్టుల పాత్ర కీలకం

26న జడ్పీ స్థాయి సంఘ సమావేశం

నకిలీ పురుగు మందులు సీజ్ 6

అన్నదాతకు ప్రభుత్వం అండ

వ్యవసాయం లాభసాటి కావాలన్నదే ధ్యేయం ● సుఖీభవ నిధుల విడుదలలో మంత్రి గొట్టిపాటి

సత్తెనపల్లి రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలిచిందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మండలంలోని గుడిపూడి గ్రామంలో బుధవారం అన్నదాత సుఖీభవ పథకం రెండో విడత నిధుల విడుదల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వ్యవసాయం లాభ సాటి కావాలి, రైతుల బతుకులు మారాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకం ద్వారా 46.85 లక్షల మందికి ఏటా రూ.10 వేల కోట్లకుపైగా పెట్టుబడి సాయం అందిస్తున్నామన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో 90 శాతం అమలు చేశామని తెలిపారు. డబుల్ ఇంజన్ సర్కారు వల్ల రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందు తుందన్నారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జగన్ హయాంలో రైతులు అనేక ఇబ్బందులు పడగా వారి జీవితానికి చంద్ర బాబు నమ్మకంగా నిలిచారన్నారు. అనంతరం పురుగు మందులు, ఎరువులు, వ్యవసాయ యంత్రాలు, యంత్ర పరికరాల స్టాల్స్‌ను మంత్రి ప్రారంభించి వాటిని పరిశీలించారు. కార్యక్రమంలో కలెక్టర్ కృతికాశుక్లా, మార్కెట్ యార్డు చైర్మన్ కొమటినేని శోభారాణి, లగడపాటి గజానన, కొనకంచి పుల్లారావు, గద్దె అప్పారావు, దరువూరి నాగేశ్వరరావు, మక్కపాటి రామచంద్రరరావు, కొమటినేని శ్రీనివాసరావు, భీమినేని వందనాదేవి, అధికారులు, రైతులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



చెక్కును పంపిణీ చేస్తున్న మంత్రి గొట్టిపాటి, ఎంపీ లావు, ఎమ్మెల్యే కన్నా

ఉక్కు మనిషి పటేల్

- ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు
- ఘనంగా ఐక్యతా పాదయాత్ర



ర్యాలీని ప్రారంభిస్తున్న లావు, కలెక్టర్ కృతికా శుక్లా

నరసరావుపేట కల్చరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) దేశ సమైక్యత కోసం దృఢంగా నిలబడిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ అని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు అన్నారు. బుధవారం స్థానిక ఎస్ఎస్ఎన్ కళాశాల క్రీడా ప్రాంగణం నుంచి సర్దార్ పటేల్ 150 ఐక్యతా పాదయాత్ర ప్రారంభమైంది. యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ మైభారత్ గుంటూరు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పటేల్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ర్యాలీని ఎంపీ, కలెక్టర్ కృతికా శుక్లా పచ్చ జండా ఊపి ప్రారంభించారు. పట్టణంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ సాగింది. విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని ఐక్యతా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు మాట్లాడుతూ.. పటేల్ విభజిత భారత దేశాన్ని ఏకతా సూత్రంలో సమైక్యంగా నిలిపిన నిర్మాతగా పేర్కొన్నారు. దేశ ఐక్యతకు పటేల్ చిహ్నమన్నారు. కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ.. వ్యక్తిగత ప్రాంతీయ ప్రయోజనాల కన్నా దేశ సమైక్యత గొప్పదని పటేల్ చాటి చెప్పారన్నారు. ఆధునిక భారత దేశానికి పునాదులు వేయడానికి నిరంతరం కృషి చేసారన్నారు. మేరా యువ భారత్ గుంటూరు జిల్లా ఉప సంచాలకులు కిరణ్మయి దేవి రెడ్డి, ఎయిర్‌ఫోర్స్ వింగ్ కమాండర్ షేక్ యూసఫ్ అలీ, ఆర్డీవో కె. మధులత, కమిషనర్ జస్వంతరావు, మక్కెన మల్లికార్జునరావు, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ సరళకుమారి పాల్గొన్నారు.

చెత్తలో చిల్లర వేట

నరసరావుపేటలో ఇంకా చెత్త పన్ను వసూలు



- జనం ముక్కుపిండి వసూలు చేస్తున్న నేతలు
- అక్రమార్కుల పంచన చేరిన పురపాలకులు
- నెలవారి వాటాలతో దండుకుంటున్న వైనం
- వాణిజ్య సంస్థలు, అపార్ట్‌మెంట్లే టార్గెట్..

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)


అధికార పార్టీ నేతలు చెత్తనూ వదలడం లేదు. జనం ముక్కుపిండి చెత్త పన్ను వసూలు చేస్తున్నారు. బహుళ అంతస్తుల భవనదారుల నుంచి ఇంటికి నెలకు రూ.60 చెత్త పన్ను కట్టించుకుంటున్నారు. మునిసిపాలిటీల్లో వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన చెత్త పన్నును కూటమి ప్రభుత్వం రద్దు చేసిన విషయం తెలిసందే. జిల్లా కేంద్రం నరసరావుపేట పురపాలక సంఘంలో మాత్రం చెత్త పన్ను రద్దు చేయక పోవడం గమనార్హం. కొందరు టీడీపీ నేతలు చెత్త పన్ను రూపంలో నెలకు రూ.లక్షల్లో వసూలు చేసుకుంటూ జేబులు నింపుకుంటున్నారు. దీనిని అడ్డుకోవాల్సిన పురపాలకులు అక్రమార్కుల పంచన చేరి పోయారు. నెలవారీ వాటాలు దండుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వాణిజ్య సంస్థలకు వాయింపు..

మునిసిపాలిటీ పరిధిలో చెత్త సేకరణలో కొంత భాగం ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లింది. అపార్ట్‌మెంట్లు, ఆస్పత్రులు, కల్యాణ మండపాలు, హోటళ్లు, బార్లు ఇలా వాణిజ్య సంస్థల్లో వ్యర్థాల సేకరణకు ఒక్కొక్కరి నుంచి నెలకు రూ.1,500 నుంచి రూ.6,000 వరకు వసూలు చేస్తున్నారు. ఇలా వసూలు చేసిన సొమ్మును మునిసిపాల్టీకి చెల్లించడం లేదు. ఇదంతా ప్రైవేట్ వ్యక్తుల జేబుల్లోకి వెళ్తోంది. ఇదే తరహాలో గత ఐదేళ్ల వైసీపీ నేతలు దోచుకున్నారు. ఇప్పుడు కూటమి నేతల వంతైంది. ఒక వేళ ఆయా భవనాల నుంచి వ్యర్థాల సేకరణ ప్రైవేటీకరించాలంటే టెండర్ నిర్వహించాలి. ఎవరి నుంచి ఎంత చెత్త పన్ను వసూలు చయాలన్న గేజిట్‌ను మునిసిపాల్టీ ప్రకటించాలి. ఇవేవి లేకుండానే (మిగతా 6వ పేజీలో)

చెత్త పన్ను రశీదులు..

నరసరావుపేట పురపాలక సంఘం ఆధ్వర్యంలో చెత్త సేకరణకు డబ్బు వసూలు చేసున్నట్లు ముద్రించిన రశీదులను జారీ చేస్తున్నారు. ఒక అపార్ట్‌మెంట్‌లో 50 ఫ్లాట్‌లు ఉంటే రూ.60 చొప్పున రూ.3,000 తీసుకొని రశీదు కూడా ఇచ్చారు. ఇలా అన్ని అపార్ట్ మెంట్‌ల నుంచి చెత్తపన్ను వసూలు యథేచ్ఛగా సాగుతోంది.



ముద్రించిన చెత్త పన్ను వసూలు రశీదు

రక్తికట్టిన రాచగావు

- ప్రారంభమైన వీరారాధన ఉత్సవాలు

8



ఎర్రజెండాను ఎగరవేస్తున్న పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ అయ్యవారు

డిగ్రీ కళాశాలను కొనసాగించాలి

- ఎన్‌బీటీఅండ్ ఎన్‌వీసీ విద్యార్థులు డిమాండ్
- విద్యార్థులతో చర్చించిన ఆర్‌జేడీ డాక్టర్ కళావతి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్‌జేడీ డాక్టర్ పీ కళావతి

నరసరావుపేట టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలోని ఎన్‌బీటీ అండ్ ఎన్‌వీసీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాలను కరస్పాం డెంట్‌కు అప్పగించినా అద్దె భవనాల్లో అయినా కళాశాలను కొసాగించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. బుధవారం కళాశాలను ఆర్‌జేడీ డాక్టర్ పీ కళావతి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమై చర్చించారు. కళాశాల విషయంపై కలెక్టర్, ఎమ్మెల్యే, ఎంపీ, ఇతర ప్రజాప్రతినిధులను కలుస్తామని, అవసరమైతే ఆందోళన చేస్తామని విద్యార్థులు హెచ్చరించారు. అనంతరం ఆర్‌జేడీ మాట్లాడుతూ న్యాయస్థానం ఆదేశాల మేరకు కళాశాల ఆస్తులను కరస్పాండెంట్‌కు అప్పగిస్తామన్నారు. కళాశాలలోని విద్యార్థులకు వినుకొండ, మాచర్ల, గుంటూరు తదితర ఇతర కళాశాలలో చేరడానికి అవకాశం ఇచ్చామన్నారు. కళాశాలలో బీకామ్ కంప్యూటర్ అప్లికేషన్, బీఎస్సీ బయాలజీ, బీకామ్, బీఏ పొలిటికల్ సైన్స్ కోర్సులకు సంబంధించి ద్వితీయ సంవత్సరంలో 57 మంది, ఫైనల్ ఇయర్‌లో 18 మంది విద్యార్థులు ఉన్నారని చెప్పారు. ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఇన్‌టర్న్‌షిప్ జరుగుతుందని, వారు రిపోర్టు అందచేస్తే సరిపోతుందన్నారు.

24న క్రోసూరులో జాబ్ మేళా

క్రోసూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాల్‌టెక్నిక్ కళాశాలలో ఈ నెల 24న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఇ.తమ్మాజీరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పది కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, అభ్యర్థుల అర్హతను బట్టి రూ.15 వేల నుంచి రూ. 35 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల వయసులోపు వారు అర్హులని పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమా, డిగ్రీ, బీటెక్, ఫార్మసీ, పీజీ అభ్యర్థులు తమ పూర్తి బయోడేటా, విద్యార్హతల నకళ్లతో హాజరు కావాలని తెలిపారు. పూర్తి వివరాలకు 7779858789, 8074393466 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నకిలీ పురుగు మందులు సీజ్

గురజాలటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్టిముక్కలలో 10 బాక్సుల నకిలీ పురుగు మందులను పట్టుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నాలుగు రోజుల క్రితం గురజాల పోలీసులు దాడులు నిర్వహించి ఓ గృహంలో నిల్వ ఉంచిన పురుగుల మందులను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ. 6 లక్షలు ఉంటుందని పోలీసుల అంచనా. ప్రముఖ పురుగు మందుల కంపెనీల పేర్లతో నకిలీ పురుగు మందులు తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. దీనిపై పోలీసులను వివరణ కోరగా.. గ్రామానికి చెందిన ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని చెప్పారు. వీరికి సరఫరా చేస్తున్న తెలంగాణకు చెందిన వ్యక్తి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

వాహన మరమ్మతులపై ఉచిత శిక్షణ

గుంటూరు విద్య నవంబరు 19 ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు వాహన మరమ్మతులపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా పారిశ్రామిక శిక్షణా కేంద్రం (ఐటీఐ) కో-ఆర్డినేటర్ సాయి వరప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ అనంతరం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న యువత ఆధార్, పదవ తరగతి మార్కుల జాబితా ఇతర వివరాలతో కలెక్టరేట్ ఎదురుగా ఉన్న జిల్లా పారిశ్రామిక శిక్షణ కేంద్రం (ఐటీఐ కళాశాల)లో సంప్రదించాలని సూచించారు. ఇతర వివరాలకు 73868 85639 నంబరుకు సంప్రదించాలని సూచించారు.

న్యూ కేటగిరి విజేత ప్రకాశం జిల్లా ఎడ్ల జత



విజేతకు బహుమతి ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

కారంపూడి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పల్నాటి వీరారాధన ఉత్సవాలను పురస్కరించుకొని స్థానిక నూతన బస్టాండ్ సెంటర్ వద్ద నిర్వహిస్తున్న బుధవారం న్యూ కేటగిరి విభాగంలో ఎడ్ల బండ లాగుడు పోటీలు నిర్వహించారు. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొని, ప్రారంభించారు. ప్రకాశం జిల్లా, నాగులుప్పలపాడు మండలం మద్దిరాల ముప్పాళ్లకు చెందిన పుచ్చకాయల శేషాద్రి చౌదరి ఎడ్ల జత బండను నిర్ణీత సమయంలో 5,051 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలేనికి చెందిన అత్తోట శిరీషా చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్లజత 5 వేల అడుగులతో రెండో స్థానం, గుంటూరు జిల్లా కాకుమాను మండలం కొండబాలవారిపాలేనికి చెందిన జీపీ చౌదరి, లక్ష్మీ దీక్షిత్ చౌదరి ఎడ్ల జత 4,679 అడుగులతో మూడోస్థానం, పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం పిన్నెల్లికి చెందిన పిక్కిలి తేజస్వి మురళి కునాల రామకోటయ్య ఎడ్ల జత 4,304 అడుగులతో నాలుగోస్థానం, పల్నాడు జిల్లా మేడికొండూరు మండలం పాలడుగుకు చెందిన వెదురుపల్లి శ్రీనివాసరావు, శాకమూరి విజయ పవన్ కుమార్ ఎడ్ల జత 4,288 అడుగులతో ఐదోస్థానం, పల్నాడు జిల్లా పెదనందిపాడు మండలం రాజుపాలేనికి చెందిన డప్పెలపూడి వినోద్ కుమార్, మాచవరానికి చెందిన కేవీఆర్ బుల్స్ సంయుక్త ఎడ్ల జత 4250 అడుగులతో ఆరోస్థానంలో నిలిచాయి. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, సర్పంచ్ సరస్వతి బాలు నాయక్, సొసైటీ చైర్మన్ నాగవరపు రామకృష్ణ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిన శేషగిరి, రైతు సంఘం నేతలు బహుమతులు ప్రదానం చేశారు.

శబరిమలలో గుండెపోటుతో ఇప్పటం వాసి మృతి

● మంత్రి లోకేశ్ సహకారంతో గ్రామానికి చేరిన మృతదేహం



భార్య, పిల్లలతో వెంకటకృష్ణ (ఫైల్‌ఫోటో)

తాడేపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తోటి వారితో కలిసి శబరిమలై అయ్యప్ప దర్శనానికి వెళ్లిన తాడేపల్లి మండలం ఇప్పటం వాసి గుండెపోటుతో సోమవారం మృతి చెందాడు. గ్రామానికి చెందిన వీరంకి వెంకటకృష్ణ తోటివారితో కలిసి అయ్యప్ప స్వామి దర్శనానికి (మాల వేసుకోలేదు) ఈ నెల 16న శబరిమలై యాత్రకు వెళ్లాడు. 17న పంబ నదిలో స్నానం చేస్తుండగా గుండెపోటుకు గురై మృతి చెందాడని తోటివారు తెలిపారు. టీడీపీ ఇప్పటం గ్రామ నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న మంత్రి నారా లోకేశ్ చొరవ చూపించి వెంకటకృష్ణ (35) మృతదేహాన్ని బుధవారం అంబులెన్స్ ద్వారా శబరిమలై నుంచి స్వగ్రామానికి తీసుకొచ్చే ఏర్పాట్లు చేశారు. మృతునికి వ్యవసాయం జీవనాధారం కాగా, మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రామ్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ డాక్టర్ పలగాని శ్రీనివాసరావు, పలువురు నియోజకవర్గ గౌడ సంఘం నాయకులు మృతదేహానికి నివాళులర్పించి అతని కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ప్రశ్నపత్రంలో పొరపాట్లు పునరావృతం కాకూడదు

ఏఎన్‌యూ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఏఎన్యూ పరిధిలో జరిగే పీజీ ప్రశ్నపత్రాల రూపకల్పనలో మరోమారు పొరపాట్లు దొర్లకూడదని రెక్టార్ ఆచార్య శివరాం ప్రసాద్ సంబంధిత ఉద్యోగులకు సూచించారు. వర్సిటీ పరిధిలో ఈ నెల 18న పీజీ పరీక్షలకు సంబంధించి సైన్స్ ప్రశ్న పత్రం చేతిరాతతో విద్యార్థులకు ఇవ్వడంపై విద్యార్థుల నుంచి నిరసన వ్యక్తమైంది. దీనిపై బుధవారం రెక్టార్ పీజీ పరీక్షల సమ న్వయకర్త విభాగం ఉద్యోగులను తన కార్యాలయానికి పిలిపించుకొని ఆరాతీశారు. చేతి రాతతో కూడిన ప్రశ్న పత్రాలను ఇవ్వడంపై ఆయన ఉద్యోగుల వద్ద అసంతృప్తి వ్యక్తం చేశారు.

చెత్తలో చిల్లర వేట

(5వ పేజీ తరువాయి)

వ్యర్థాల సేకరణకు డబ్బు వసూలును ప్రైవేట్ వ్యక్తులకు అధికారులు అప్పగించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నరసరావుపేటలో ఇంకా చెత్త పన్ను వసూలు చేస్తుండటంపై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

ప్రభుత్వానికి చెడ్డపేరు..

తాము చెత్త పన్ను చెల్లించము.. అని అంటే.. వ్యర్థాలను తీసుకెళ్లమని సిబ్బంది చెబుతున్నారని ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకొచ్చే రీతిలో నరసరావుపేటలో టీడీపీ నేతలు వ్యవహరిస్తున్నారని కొందరు కార్యకర్తలు అవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే.. అక్రమంగా చెత్త పన్ను వసూలు చేయడంపై గతంలోనే టీడీపీ అధిష్ఠానం దృష్టి సారించింది. చెత్తను పన్ను వసూలు చేయవద్దన్న పార్టీ కేంద్ర కార్యాలయం ఆదేశాలను ఇక్కడ బేఖాతరు చేస్తున్నారు.

అక్రమ ఆదాయం చేతులు మారింది..

మునిసిపాలిటీకి ఆస్తి పన్ను చెల్లిస్తున్నప్పుడు చెత్తను సేకరించాల్సి ఉండగా దీనిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడంపై అధికార యంత్రాం గంపై పలు అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. గత ప్రభుత్వంలో ఐదేళ్ల మునిసిపాలిటీలో వ్యర్థాల తొలగింపునకు అక్రమంగా డబ్బు వసూలు చేసి కొందరు దోచుకున్నారు. నెలకు లక్షలాది రూపాయలను వైసీపీ నేతలు మింగేశారు. వైసీపీ బాటలోనే కూటమిలోని నేతలు కూడా పయనిస్తున్నారు. చర్యలు తీసుకోవాల్సిన మునిసిపల్ అధికారులు అక్రమార్కులకు సహక రిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

చెత్త పన్ను ప్రభుత్వం రద్దు చేసిందని కమిషనర్ జస్వంత్‌రావు తెలిపారు. ప్రైవేట్ వ్యక్తులు వ్యర్థాల సేకరణకు డబ్బు వసూలు చేయడంపై తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. మునిసిపాలిటీ ద్వారానే ఆయా భవనాల నుంచి చెత్త సేకరణ చేపడతామని చెప్పారు.

ఔషధాల తయారీలో ఫార్మసిస్టుల పాత్ర కీలకం



ఫార్మసీ వారోత్సవాల ర్యాలీలో పాల్గొన్న వీసీ, రెక్టార్, రిజిస్ట్రార్

ఏఎన్‌యూ నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఔషధాల తయారీలో ఫార్మసిస్టుల కీలక పాత్ర పోషిస్తున్నారని అచార్య నాగార్జున యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య గంగాధరరావు పేర్కొన్నారు. వర్సిటీ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ ఫార్మసీ వారోత్సవాల్లో బుధవారం ఫార్మా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ముఖ్య అతిథిగా వీసీ ప్రారంభించారు. ప్రొఫెసర్ శివరాంప్రసాద్, రిజిస్ట్రార్ సింహాచలం పాల్గొన్నారు. డాక్టర్ కేవీ ప్రవల్లిక మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అధ్యాపకులు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఫార్మసీ కళాశాల ఆచార్యులు తేజోమూర్తి, ఎన్‌పీడబ్ల్యూ కో-ఆర్డినేటర్ డాక్టర్ షేక్. మస్తానమ్మ వారం రోజులు నుంచి నిర్వహిస్తున్న వివిధ రకాల పోటీలను క్లుప్తంగా వివరించారు. ప్రొఫెసర్ దేవినేని జ్యోతిర్మయి, ర్యాంకింగ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ రవి పరిమి, డాక్టర్ కె.విజయ్ కిషోర్, అధ్యాపకులు, పరిశోధన విద్యార్థులు పాల్గొన్నారు.

పరీక్షల తనిఖీ

ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరుగుతున్న పీజీ, వృత్తి విద్యా కోర్సుల పరీక్షలను రెండవ రోజు సమన్వయకర్త ఆచార్య ఎం.సుబ్బారావు తనిఖీ చేశారు. వర్సిటీ బోటనీ, జువాలజీ, కంప్యూటర్ సైన్స్ పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. సమర్థంగా పరీక్షల నిర్వహణకు పరిశీలకులతో పాటు.. మూడు తనిఖీ బృందాలను నియమించామని చెప్పారు.

న్యాయవిద్యార్థులకు అభినందన..

విశాఖలో జరిగిన సీఐఐ పెట్టుబడుల భాగస్వామ్య సదస్సుకు హాజరైన డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ లీగల్ స్టడీస్ విద్యార్థులను తాత్కాలిక ఉపకులపతి ఆచార్య కె.గంగాధర్‌రావు తన కార్యాలయంలో అభినందించారు. విభాగాధిపతి ప్రొఫెసర్ ఎస్.విజయలక్ష్మి తోడ్పాటుతో సదస్సులో న్యాయపరమైన కంపెనీల పెట్టుబడుల కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా చూడగలిగామని విద్యార్థులు వీసీకి వివరించారు.

పెదకాకాని మల్లేశ్వరస్వామి సేవలో మంత్రి సుభాష్



రాహు కేతు పూజలో మంత్రి సుభాష్

పెద కాకాని, నవం బరు 19 (ఆంధ్ర జ్యోతి): పెద కాకానిలోని గంగ భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వా మి దేవస్థానాన్ని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ బుధవారం దర్శించారు. మంత్రికి అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మల్లేశ్వర స్వామి, భ్రమరాంబ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపిం చారు. రాహు కేతులకు పూజలు చేయించారు. అర్చకస్వా ములు వేద ఆశ్వీరవచనం అందజేసి, స్వామివారి శేష వస్త్రంతో సత్కరించారు. స్వామి ప్రసాదం, చిత్ర పటం బహూకరించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	128, 137, 148
చికెన్ విత్ స్కిన్(కిలో)	240.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	250.00

నిత్యాన్నదాన పథకానికి విరాళం

పెదకాకాని, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పెద కాకాని మల్లేశ్వరస్వామి దేవస్థానంలో నిత్య అన్నదాన పథకానికి బుధవారం విజయవాడకు చెందిన తిరుక్కోవల్లూరి సాంబమూర్తి పేరు మీద భార్య శోభ రూ. 50,116, గుంటూరుకు చెందిన నందిగామ సాంబశివరావు, నర్రా రామమూర్తి, గింజుపల్లి గోపాల్ స్వామి పేరు మీద నందిగామ శిరీష, ప్రసాద్ రెడ్డి దంపతులు రూ.50 వేలు విరాళం అందించినట్లు ఆలయ ఉప కమిషనర్ జి. లీలాకుమార్ బుధవారం తెలిపారు.

50,247 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 52,346 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 50,247 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 14,006 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	10000	14300
334	10000	18000	ఏసీ కామన్ వెరైటీ		
నెంబరు. 5	10000	16000	334	10500	17500
273	10500	14500	నెంబరు. 5	12000	16500
341	10000	17500	341	12000	18000
4884	----	----	4884	11000	14600
సూపర్ 10	----	----	సూపర్ 10	10500	16000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	16000	తేజ	11000	16000
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	18500
బ్యాడిగి	11000	18200	దేవనూరు డీలక్స్	10500	17700
దేవనూరు డీలక్స్	10500	17500	తాలుకాయలు	5000	9000

26న జడ్పీ స్థాయి సంఘ సమావేశం

గుంటూరు సిటీ, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ఆరవ స్థాయి సంఘం సమావేశం ఈ నెల 26న నిర్వహించనున్నట్లు సీఈవో వీర్ల జ్యోతిబసు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైస్ ఛైర్‌పర్సన్ బత్తుల అనురాధ అధ్యక్షతన సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. సంక్షేమం, కార్పొరేషన్లు, డీఆర్డీఏ, డ్వామా, గృహ నిర్మాణం తదితర శాఖలపై సమీక్షించడం జరుగుతుందని తెలిపారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

యడ్లపాడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగారావుపాలెం గ్రామ పరిధిలోని పేకాట స్థావరంపై పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. స్థానిక ఎస్సీ కాలనీలోని చెరువు కట్టపై ముళ్ల పొదల చాటున పేకాడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ శివరామకృష్ణ తెలిపారు. రూ.10,240లు నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

శ్రీగంధం చెట్లు చోరీ

రొంపిచర్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్బయ్యపాలెం గ్రామ సమీపంలో శ్రీగంధం చెట్లను దుండగులు రెండు రోజుల క్రితం నరికి దుంగలను తీసుకెళ్లారు. గ్రామానికి చెందిన ఇంటూరి చిన వెంకటరావు సుమారు మూడున్నర ఎకరాల్లో ఎర్రచందనం, శ్రీగంధం చెట్లను సాగు చేస్తున్నారు. 150 మొక్కలను పెంచుతుండగా 25 శ్రీ గంధం చెట్లను దొంగలించారు. వీటి విలువ సుమారు రూ.20 లక్షల మేర ఉంటుందని బాధితుడు తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

వాట్సాప్‌తో కొనుగోళ్లు

(5వ పేజీ తరువాయి)

ధాన్యం అమ్ముకునే విషయంలో ప్రతీ సీజన్‌లోనూ రైతుల నుంచి ప్రభుత్వానికి ఫిర్యాదులు అందుతూనే ఉంటాయి. ఈ క్రమంలో అర్హత కలిగిన ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగకూడదనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ సరికొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. వాట్సాప్ నెంబరుకు హాయ్ అనే మెసేజ్ పెట్టిన తర్వాత ఏఐ వాయిస్ ఇచ్చే సూచనలను రైతులు పాటించాల్సి ఉంటుంది. ఆధార్ నంబరు ఎంటర్ చేసిన తర్వాత రైతు తన పేరును ధ్రువీకరించాల్సి ఉంటుంది. ఏ కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని అమ్మాలనుకుంటున్నారో తెలియపరచడంతో, విక్రయానికి సంబంధించి ఇచ్చే మూడు తేదీలలో ఓ దానిని రైతు ఎంపిక చేసుకునే వీలు కూడా కల్పించారు. ఇక ఏ రకం ధాన్యం, పరిమాణం ఎంత అనే వివరాల కోసం ప్రత్యేక ఆప్షన్ వాట్సాప్ ద్వారానే ఇవ్వనున్నారు. తర్వాత ప్రక్రియగా అమ్మకం తేదీ ఖరారు, షెడ్యూల్ బుక్ అయినట్లు స్లాట్ కూపన్ వాట్సాప్ ద్వారానే రైతుల దరికి చేరేలా టెక్నాలజీని ప్రభుత్వం డిజైన్ చేసింది. ఈ విధానంలో అన్నదాతలకు సమయం ఆదాతో పాటు ఖర్చులూ తగ్గనున్నాయి.

బాపట్ల జిల్లాలో 2 లక్షల టన్నులు

బాపట్ల జిల్లాలో మంగళవారం 5 కొనుగోలు కేంద్రాల సేవలను అందుబాటులోకి తెచ్చిన సివిల్ సప్లయిస్ విభాగం బుధవారం 117 కేంద్రాలను ప్రారంభించింది. రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చింది. గతేడాది 93,000 మెట్రిక్ టన్నుల సేకరించగా, ఈ ఏడాది ఏకంగా రెండు లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి ఏర్పాట్లు చేసింది.

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

రిసోర్స్ పర్సన్‌లకు శిక్షణ

సత్తెనపల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పురపాలకసంఘ కార్యాలయంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ రిసోర్స్‌పర్సన్‌లకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ గవర్నెన్స్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఘనవ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ నిర్మూలన, స్వచ్ఛ సర్వేక్షణ్, హోం కంపోస్టింగ్ వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. శిక్షణను ప్రారంభించిన మునిసిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ రిసోర్స్‌పర్సన్‌లు తమ సామర్థ్యాలను మెరుగుపరుచు కోవాలన్నారు. శిక్షకులుగా వచ్చిన తిరుపతిరావు, హరీష్, పల్నాడు జిల్లా కో-ఆర్డినేటర్లు శివపార్వతి, గోపీ పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు.

ఎస్టీయూ నూతన కార్యవర్గం ఎంపిక

మాచవరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మాచవరం మండల నూతన ఎస్టీయూ కార్యవర్గం ఎంపికైంది. బుధవారం మాచవరంలో నూతన కార్యవర్గంలో అధ్యక్షులుగా బుర్రి శ్రీనివాసరావును, ప్రధాన కార్యదర్శి కాండ్రగుంట రాంబాబును, ఆర్థికకార్యదర్శిగా సకినాల శ్రీనివాసరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు ఎస్టీయూ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు జోసెఫ్ సుధీర్ బాబు ముఖ్య అతిథిగా ఎన్నిక కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎస్టీయూ కార్యవర్గసభ్యులందరూ పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ కార్తిక వన సమారాధన

అచ్చంపేట: మండలంలోని నీలేశ్వరపాలెంలో ఉన్న శ్రీగిరిజా సమేత నీలకంటేశ్వరస్వామి దేవాలయం వద్ద మండల నాయీ బ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యం లో వనసమారాధన నిర్వహించారు. నాయీ బ్రాహ్మణ కార్పోరేషన్ చైర్మన్ మద్దిరాల గంగాధర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో జాగర్లమూడి రామ్మూర్తి, మార్బూరి పెద్ద సాంబయ్య, రాంబాబు, శంకర్‌బాబు, తుళ్ళూరి రంగారావు పాల్గొన్నారు.

● మండలంలోని నీలేశ్వరపాలెం నీలకంటేశ్వరస్వామి ఆలయం వద్ద శ్రీకృష్ణదేవరాయ కాపుసేవాసంఘం కార్తిక వనసమారాధన జరిగింది. మండల కాపుసంఘం నాయకులు పాల్గొన్నారు.

● మాచర్ల: పట్టణంలోని వడ్డెర బజారులో ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం వడ్డెర కార్తిక వన సమారాధనను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటి చైర్మన్ ఉప్పుతోళ్ల గోవిందరాజులు, సభ్యులు ఓరుగంటి చెన్నకేశవరావు, కొమెర శ్రీనివాసరావు, ఉప్పుతోళ్ల ఏడుకొండలు, కామనబోయిన కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో..

అమరావతి: 72వ సహకార వారోత్సవాలలో భాగంగా స్థానిక జీడీసీసీ బ్యాంక్ వద్ద శుక్రవారం కార్తిక వనసమారాధన నిర్వహిస్తున్నారు. మునగోడు, నరుకుళ్లపాడు, పెదమద్దూరు పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుంది. చైర్‌పర్సన్, పర్సన్, సిబ్బంది, బ్యాంక్ సిబ్బంది, జిల్లా అధికారులు పాల్గొంటున్నారు.

పాఠశాలలకు ఆట వస్తువులు

మండలంలోని 56 ప్రభుత్వ పాఠశాలలకు సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా 36 రకాల క్రీడా సామాగ్రి 3 క్లస్టర్ హైస్కూల్స్‌కు గురువారం వచ్చాయి. వీటిని క్లస్టర్ పరిధిలోని పాఠశాలలకు శుక్రవారం నుండి పంపిణీ చేయనున్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు, సామాన్లు దగ్ధం

బెల్లంకొండ: బెల్లంకొండలో బుధవారం తెల్లవారుజామున షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు, సామాగ్రి దగ్ధమయ్యాయి. మాచర్ల షేక్ ఖాశిం సాహెబ్‌కు చెందిన ఈ ఇల్లు పూర్తిగా కాలిపోయింది.

అల్పాహారం పంపిణీ

పెదకూరపాడు: మండలంలోని బుడగజంగాల కాలనీలో బుధవారం జన చైతన్యసమితి ఆధ్వర్యంలో యామ నరేంద్ర సమకూర్చిన అల్పాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో పరుచూరి పూర్ణచంద్రరరావు, సమితి కార్యదర్శి తుళ్ళూరి సాంబశివరావు, సయ్యద్ ఖాదర్ బాషా తదితరులు ఉన్నారు.

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి

సత్తెనపల్లి: పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ జయంతిని నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాదంశెట్టి వేదాద్రి, దాసరి జ్ఞాన్‌రాజ్‌పాల్, కోట ఆనంద్, చాంద్ బాషా, శేఖర్, పాల్ రాజు, మోహన్‌రావు పాల్గొన్నారు.

బాలల హక్కులను కాపాడాలి

నకరికల్లు: బాలల హక్కులను కాపాడాలని డీబీఆర్‌సీ ఏరియా కో-ఆర్డినేటర్ గడ్డిపర్తి కోటిరత్నం అన్నారు. బుధవారం బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా నకరికల్లు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులతో ప్రదర్శన నిర్వహించారు. బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జాలాది శ్రీనివాసరావు, మహిళా పోలీసులు లోకేశ్వరి, కోమలి, ఫిజికల్ డైరెక్టర్ ఝాన్సీలక్ష్మి బాయి పాల్గొన్నారు.

ఘనంగా రుద్ర మహాయాగం

సత్తెనపల్లి: పట్టణంలోని శరభయ్యగుప్తా హిందూ హైస్కూల్ క్రీడాప్రాంగణంలో బుధవారం భైరవపీఠం, శనీశ్వర పాసుపత రుద్రమహాయాగం కమిటీ ఆధ్వర్యంలో జరిగిన శనీశ్వర పాసుపత రుద్రయాగంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు. శ్రీశ్రీ నిత్య విద్యానందభారతీ స్వామి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. పలువురు ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

దేశాభివృద్ధిలో ఇందిరమ్మ పాత్ర చారిత్రాత్మకం

మాచర్ల రూరల్: దేశాభివృద్ధిలో ఇందిరమ్మ పాత్ర చారిత్రాత్మకమని కాంగ్రెస్ పార్టీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొమ్ము కోటేశ్వరరావు, దొడ్డా శ్రీనివాసరావు, గాదె పుల్లారెడ్డి, రాగిడి ప్రతాప్‌బాబు, షేక్ బాబు, గాలం అంజి, వెంకటేశ్వర్లు, అలీ, ఆదిరెడ్డి, నారాయణరెడ్డి, కలివేల రామయ్య పాల్గొన్నారు.

చేతి సంచుల అందజేత

కారంపూడి: పల్నాటి వీరారాధన ఉత్సవాల సందర్భంగా పల్నాటి చరిత్ర డాక్యుమెంటరీ యూనిట్ సభ్యులకు బుధవారం వాసవీ సేవాసమితి సభ్యులు చేతి సంచులను అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య జిల్లా కార్యదర్శి వెచ్చా వరలక్ష్మణరావు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బూసా రామాంజినేయులు, యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యేక తరగతుల పరిశీలన

దుర్గి: స్థానిక జడ్పీ హైస్కూల్, కేజీబీవీ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సాయంత్రం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను ఎంఈవో-2 బెంజిమెన్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు, విద్యార్థులకు పలు సూచనలు చేశారు. హైస్కూల్‌లో ఈనెల 14వ తేదీన నిర్వహించాల్సిన ఫిజికల్ సైన్స్ పరీక్ష గురువారం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం హనుమంతురావు పాల్గొన్నారు.

లింగమ్మకు ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి నివాళులు

విజయపురిసౌత్ : మాచర్ల మండలం తాళ్లపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త పోలేబోయిన సిద్ధు తల్లి లింగమ్మ వృద్ధాప్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న నాగార్జున సాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి బుధవారం తాళ్లపల్లి గ్రామానికి చేరుకొని లింగమ్మ భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. సిద్ధు కుటుంబసభ్యులను పరామర్శించారు.

బైకును ఢీకొన్న టిప్పర్.. మహిళ మృతి

సత్తెనపల్లి: బైకును టిప్పర్ ఢీకొన్న ఘటన బుధవారం రాత్రి 10 గంటలకు జరిగింది. స్థానిక అచ్చంపేట రోడ్డుకు చెందిన కోటా కృష్ణకుమారి(65) తన కుమారుడు వెంకటరావుతో కలిసి బైక్‌పై బస్టాండ్ వైపు వెళుతుండగా వెనకనుంచి టిప్పర్ ఢీకొంది. ఆమె కిందపడటంతో టిప్పర్ టైరు ఆమె తలపైకి ఎక్కి అక్కడికక్కడే మృతిచెందింది. పట్టణ పోలీసులు ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియావైద్యశాలకు తరలించారు. టిప్పర్‌ను పట్టణ పోలీస్ స్టేషనుకు తరలించారు. వెంకట్రావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

ఐదేళ్లు టిడ్కో గృహాలను పాడుబెట్టారు !

● మార్చి లోగా పూర్తిచేయాలి

● అధికారులతో ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు 2014-19లో పిడుగురాళ్లలో 6వేల టిడ్కో గృహాలను చంద్రబాబునాయుడు మంజూరు చేశారని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం పట్టణంలోని టిడ్కో గృహాలను అధికారులతో కలిసి ఎమ్మెల్యే సందర్శించి అక్కడ జరుగుతున్న పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే విలేకర్లతో మాట్లాడుతూ 6వేల గృహాల్లో వివిధ కేటగిరీలలో 2,832 గృహాలను అప్పటి టీడీపీ హయాంలోనే 75శాతంపైగా పూర్తి చేశామన్నారు. తరువాత ఐదేళ్ల వైసీపీ హయాంలో వాటిని పాడుబెట్టారన్నారు. రాబోయే మార్చి నాటికి టిడ్కో గృహాలను పూర్తిచేసేలా పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, వడ్డవల్లి సర్వేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ ఐ శ్రీనివాసులు, పిల్లి చెన్నారావు, పాండురంగ శ్రీను, వడ్డవల్లి సాంబశివరావు, కామిశెట్టి రమేష్, దూదేకుల ఖాశింసైదా, మందా డేవిడ్, యేలూరి శశికుమార్, కందిమళ్ల శ్రీను, షేక్ సైదా, ఫరీద్ మేస్త్రి, ఏఈ పద్మావతి, కెకొండయ్య, షాపోజి పల్లొంజి ఏజెన్సీ ప్రతినిధి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

పిడుగురాళ్ల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం రైతుల లోగిళ్లలో సంతోషం వెల్లివిరిసిందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. పిడుగురాళ్ల మార్కెట్ యార్డులో అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రెండవ విడత 38,676 మంది రైతులకు రూ.23కోట్ల 26లక్షలు జమయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సాగు భూములకు నీరందేలా మరమ్మతులు పూర్తిచేశామన్నారు. నియోజకవర్గం పరిధిలో మూడు సీసీఐ కేంద్రాలను ఏర్పాటుచేసి పత్తికి మద్దతుధర కల్పించామన్నారు. అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్‌తో రైతులకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు, నియోజకవర్గ పరిశీలకులు కళ్లం విజయభాస్కర్‌రెడ్డి, వ్యవసాయ అధికారులు మోహన్, అంజలిబాయి, సంధ్యారాణి, పుల్లారెడ్డి, రామమ్మ, మున్సిపల్ చైర్మన్ సుబ్బారావు, మార్కెట్‌యార్డు చైర్మన్లు తురకా వీరస్వామి, బెల్లంకొండ భారతి భద్రి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యేలూరి శశికుమార్, గండికోట వెంకటేశ్వర్లు, బడిగుంచల వెంకటేశ్వర్లు, నర్రా పుల్లయ్య, పగడాల భాస్కరరావు, వున్నం ఆంజనేయులు, దియ్యా రామకృష్ణ, కుంచపు గంగరాజు, పొందూరి నరసింహారావు, నేలవల్లి బొల్లయ్య, పర్వతనేని రామారావు, జొన్నలగడ్డ శ్రీను, యడ్లపల్లి శివ, మేకల సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

అన్నదాతకు సుఖీభవ సాయం

● శాసనసభ్యుడు బ్రహ్మానందరెడ్డి

కారంపూడి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతన్న సాగుకు కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకాల ద్వారా పెట్టుబడి సాయం అందిస్తుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పాత బస్టాండ్ ప్రాంగణంలో అన్నదాత సుఖీభవ రెండో విడత నగదు పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా వ్యవసాయ అనుబంధ స్టాల్స్‌ను సందర్శించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం ప్రతినిధులు ఏర్పాటు చేసిన గో-ఆధారిత ప్రకృతి వ్యవసాయం మోడల్‌ను సందర్శించారు. వేదికపై నియోజకవర్గ వ్యాప్తంగా 38,923 మంది రైతులకు రూ.26.08 లక్షల నగదును చెక్కులను అందజేశారు. ఎన్టీఆర్, సీఎం చంద్రబాబు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ధాన్యం, పత్తి కొనుగోలు చేసి తక్షణమే రైతు ఖాతాలో నగదు జమ చేస్తూ కూటమి ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మినీ మహాభారతమే వీరుల మహోత్సవం

మాచర్ల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మినీ మహాభారతమే కారంపూడి వీరుల మహోత్సవమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. బుధవారం కారంపూడి వీరుల మహోత్సవం తొలిరోజు ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా ప్రారంభించారు. ఉత్సవాలకు విచ్చేసిన ఎమ్మెల్యే, ఆయన తనయుడు సాయి వివేకానందరెడ్డిలకు టీడీపీ శ్రేణులు అంకాళమ్మ దేవాలయం వద్ద గజమాలతో ఘన స్వాగతం పలికారు. ద్విచక్ర వాహనాలతో ర్యాలీ జరిపారు. రైతు సంఘం ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన రెండు తెలుగురాష్ట్రాల ఎడ్లపందేలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పల్నాడు గడ్డ పౌరుషాలకు, త్యాగాలకు, ఆధ్యాత్మిక కేంద్రాలకు నెలవన్నారు. వీరుల మహోత్సవానికి ప్రపంచవ్యాప్తంగా తరలివస్తున్న వీరాచారవంతులు, ప్రజలకు అసౌకర్యం కలగకుండా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

ఆపత్కాలంలో అండ టీడీపీ సభ్యత్వం

వెల్దుర్తి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సభ్యత్వంతో ఆపత్కాలంలో కార్యకర్తలకు టీడీపీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బోదలవీడు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త బెల్లంకొండ శ్రీనివాసరావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా పార్టీ సభ్యత్వ ప్రమాద బీమా రూ.5లక్షల నగదు చెక్కును భార్య లక్ష్మీదుర్గకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మందలపు రామకృష్ణ, సాధనాల ప్రసాద్, వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజాదర్బార్

వెల్దుర్తి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యాన గురువారం మధ్యాహ్నం 2:39 గంటలకు ప్రజాదర్బార్ నిర్వహించనున్నారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరించనున్నారు. కక్షిదారులు తప్పనిసరిగా ఆధార్ కార్డు జిరాక్స్ జతచేయాలని కార్యాలయ వర్గాలు తెలిపాయి.

విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలి

మాచర్ల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలని, మాయమాటలకు, ప్రలోభాలకు లొంగకూడదని సచివాలయ మహిళా పోలీసు నాగమణి అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. దిశా చట్టంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్‌చార్జి అధికారి ఎం మెర్సీ, గాదె కిరీటిరెడ్డి, స్వరూప, శ్రీనివాస్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

బాల్యంలో పుస్తకాలతో స్నేహం చేస్తే భవిష్యత్ బంగారుమయం

దాచేపల్లి: బాల్యం నుంచే విద్యార్థులు పుస్తకాలతో మమేకం కావాలని, తద్వారా వారు జీవితంలో అనుకున్న లక్ష్యాలను సాధిస్తారని ఉపాధ్యాయులు క్రోసూరి రవికుమార్, రాపోలు వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం దాచేపల్లి శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వారోత్సవాల్లో భాగంగా పాఠకుల్లో పఠనాసక్తిని పెంచే అంశంపై కార్యక్రమం నిర్వహించారు. స్థానిక గ్రంథాలయ అధికారి శివపార్వతి అధ్యక్షత వహించారు. నాన్న అనే కవితను చక్కగా విన్పించిన విద్యార్థి గోపతోటి మోక్షగీతికకు బహుమతిని ప్రదానం చేశారు.

ముగ్గుల పోటీలు

అచ్చంపేట: అచ్చంపేటలోని పలు పాఠశాలల్లో బుధవారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ముగ్గుల పోటీలు, అల్లికలు నిర్వహించినట్టు గ్రంథాలయ అధికారి బీ నాగరాజు బుధవారం తెలిపారు. ప్రగతి యూపీ స్కూల్‌లోను, ఎంపీపీ ఎలిమెంటరీ స్కూల్ మెయిన్‌లోను ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం కేసీ నరసింహారావు, వై జ్యోతి, పీఎల్ రావు, సుబ్బలక్ష్మి గార్లచే మహిళా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు వక్తత్వం, క్విజ్, డ్రాయింగ్, ఆటలపోటీలు నిర్వహించారు.

● క్రోసూరు: క్రోసూరులోని శాఖా గ్రంథాలయంలో బుధవారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. గ్రంథాలయ అధికారి వై వీరాంజమ్మ, విద్యార్థులు, మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బండారు మైసూర్‌బాబు, ఉపాధ్యాయులు రఘుబాబు తదితరులు పాల్గొన్నారు.

● దుర్గి: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా బుధవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు మెహందీ, క్విజ్ పోటీలను నిర్వహించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి, మహిళా దినోత్సవం సందర్భంగా ఈ పోటీలు జరిపారు. ఎంపీడీవో సుగుణ ఈ పోటీలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి పులిబండ్ల వేణుగోపి, యేచూరి రమేష్, అబ్బాస్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

● రెంటచింతల: గ్రంథాలయాలు విజ్ఞాన్ని పంచే గనులని గ్రంథాలయాధికారి ఆర్.రాజకిషోర్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధి జయంతిని గ్రంథాలయం, గిరిజన సంక్షేమ గురుకులంలో నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.మోహన్, ఎన్.శ్రీనివాసరావు, సిలార్ అహ్మద్, ఎస్టీయూ అధ్యక్షులు బేబీ రాణి, లేళ్ల శ్రీనివాసరావు, లూర్దు మర్రెడ్డి, బీముడు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్‌క్రైంపై అవగాహన

అమరావతి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) మండలంలోని లేమల్లె వీనస్ హైస్కూల్లో విద్యార్థులకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, ర్యాగింగ్, సైబర్‌క్రైం, జాబ్ ఫ్రాడ్, ఈవ్‌టీజింగ్ తదితర అంశాలపై ఎస్‌ఐ అమీర్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బోధనా సిబ్బంది పాల్గొన్నారు. ముత్తాయపాలెంలో ఎస్‌ఐ రాజశేఖర్ పల్లెనిద్రలో పాల్గొన్నారు. గ్రామంలో సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని సూచిం చారు.

రీ సర్వే తీరు పరిశీలన

సత్తెనపల్లి రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాకాలపాడులో జరుగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను రీ సర్వే ప్రత్యేక అధికారి(గుంటూరు) డీడీవీ తోయ జాక్సారావు బుధవారం పరిశీలించారు. రీ సర్వే జరుగుతున్న భూములను, రికార్డులను ఆయన పరిశీలించి సర్వే సిబ్బందికి పలు సూచనలు చేశారు. రీ సర్వే ప్రక్రియ పక్కాగా జరగాలని, భూమి కలిగిన రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఉండ కూడదన్నారు. ఆయన వెంట జిల్లా సర్వే అధికారి సీహెచ్ భాను కీర్తి, సత్తెనపల్లి సర్వే ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ శివ శ్రీనివాసులు, సర్వే సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఉయ్యందన యూపీ స్కూల్ తనిఖీ



ఉపాధ్యాయ బృందంతో సమావేశ మైన ఎంఈవోలు కృష్ణ, గణేష్

క్రోసూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉయ్యందన యూపీ స్కూల్‌ను బుధవారం ఎంఈవోలు జీ కృష్ణ, ఎం గణేష్ తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా సమ్మేటీవ్ అసెస్మెంట్-1, బుక్స్ కరక్షన్, విద్యార్థుల ప్రగతి, రైజింగ్ స్టార్స్, మధ్యాహ్న భోజనం, నోట్స్‌ల కరక్షన్, వర్క్ బుక్స్ కరక్షన్, సిలబస్ మొదలైన వాటిని నిశితంగా పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఉపాధ్యాయ బృందంతో సమావేశమై విద్యార్థుల్లో నాణ్యత ప్రమాణాల పెంపుదలకు నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

బహిరంగ వేలం

విజయపురిసౌత్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మాచర్ల మండలం ఎత్తిపోతలలో ఉన్న శ్రీరంగనాథస్వామి ఆలయంలో కొబ్బరికాయలు, పూజా సామాన్లు విక్రయించుకునే హక్కునకు బుధవారం మాచర్లలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో బహిరంగ వేలం నిర్వహించారు. కొర్రెబోయిన రామారావు రూ.1.56 లక్షలకు పాట హక్కును కైవసం చేసుకున్నారు. కూల్‌డ్రింక్స్‌కు సరైన పాట రాకపోవడంతో వేలం వాయిదా వేశారు. దత్తాత్రేయస్వామి ఆలయం వద్ద తలనీలాలు పోదు చేసుకునే హక్కును మర్రిపల్లి బ్రహ్మయ్య రూ.4.44 లక్షలకు దక్కించుకున్నారు. ఈ వేలాన్ని రంగనాథస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ బిట్టు నరసింహారావు, ఈవో లీలావతి పర్యవేక్షించారు.

శివాలయాల్లో కార్తిక శోభ

● కార్తికదీపాలతో మహిళల పూజలు

నకరికల్లు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కార్తిక మాసం పురస్కరించుకొని బుధవారం మండలంలోని శివాలయాల్లో దేవాలయాలన్నీ కార్తికదీపాలతో వెలుగులు విరజిమ్మాయి. చాగల్లులోని గంగా పార్వతి సమేత చంద్రమౌళేశ్వర స్వామి దేవాలయంలో భక్తులు కార్తిక పూజలు నిర్వహించారు. దేవాలయాన్ని పూలతో తీర్చిదిద్దారు. మహిళలు సామూహిక వ్రతంలో పాల్గొన్నారు. గంగాపార్వతి అమ్మవారిని, చంద్రమౌళేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. చీమలమర్రిలోని గంగాభవానీ సమేత సోమేశ్వరస్వామి దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించారు. నరసింగపాడులోని అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయంలో గంగా అన్నపూర్ణ సమేత మరకత లింగ చంద్రమౌళేశ్వర స్వామి దేవాలయంలో లక్ష బిల్వార్చన ఉత్సవాలను బుధవారం కొనసాగించారు.

ప్రతి కుటుంబం మరుగుదొడ్డి కలిగి ఉండాలి

● ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ చంద్రశేఖర్

కారంపూడి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబం మరుగుదొడ్డి కలిగి ఉండాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ చంద్రశేఖర్ అన్నారు. ప్రపంచ మరుగుదొడ్డి దినోత్సవం సందర్భంగా స్థానిక జడ్పీ హైస్కూల్ విద్యార్థులచే మన మరుగుదొడ్డి - మన గౌరవం అనే నినాదంతో హైస్కూల్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ 100 శాతం మరుగుదొడ్లు కట్టిస్తామన్నారు. మరుగుదొడ్లు లేనివారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కింద మురుగునీరు శుద్ధి చేసే ప్లాంట్ కారంపూడి పంచాయతీకి మంజూరైందని, స్థలం కోసం సర్వే చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్లు నవీన్, రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగేశ్వరరావు, ఎంపీడీవో గంటా శ్రీనివాసరెడ్డి, హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, సర్పంచ్ బాణావత్ సరస్వతి బాలు నాయక్, సీహెచ్‌వో మల్లయ్య, హెల్త్ సూపర్‌వైజర్ లాలునాయక్, సుబ్బారావు పాల్గొన్నారు.



ఆంజనేయస్వామికి ప్రత్యేక అలంకారం

సత్తెనపల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కార్తికమాసంలో భాగంగా పట్టణంలోని మహారాష్ట్ర వీధిలో శ్రీభక్తాంజనేయస్వామి దేవస్థానంలో స్వామివారిని ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో మహారాష్ట్ర వీధిలోని ఆంజనేయస్వామి



అన్నదాత సుఖీభవ చెక్కును ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్

రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. మండలంలోని గారపాడులో బుధవారం అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ కార్యక్రమంలో భాగంగా రెండో విడత నగదు రైతుల ఖాతాల్లో జమ కార్యక్రమానికి నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల గంగాధర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో రెండవ విడతగా 41,149 మంది రైతులకు రూ.27.03 కోట్లను జమ చేశారన్నారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తానన్నారు. రానున్న రోజుల్లో వంద రోజులు రోజుకో గ్రామం చొప్పున వంద గ్రామాల్లో తిరుగుతానన్నారు. ఎత్తిపోతల పథకాల చైర్మన్‌లు రైతులకు సకాలంలో సాగునీరందేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు వెన్నా సాంబశివారెడ్డి, పెనుముచ్చు రామారావు, టీడీపీ మండల అధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్య, అర్తిమళ్ళ రమేష్, మక్కెన సాగర్, వడ్లమూడి అప్పారావు, బాష్యం ఆంజనేయులు, ఏటుకూరి రత్నకుమార్, ఏపూరి నాగేశ్వరరావు, టీడీపీ జిల్లా నాయకులు కన్యదార వసంతరావు, మోదుగుల చంద్రశేఖర్, గంగినేని లీలావతి, షేక్ ముంతాజ్, పెనుముచ్చు రమేష్, మేదరమెట్ల సౌమిత్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై శిక్షణ



పీఎస్‌లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో ఎంపీడీవో

బెల్లంకొండ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ ఎంపీడీవో కార్యాలయంలో ఎసెట్, ఐటీసీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లకు, సర్పంచ్‌లకు ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై శిక్షణనిచ్చారు. ముఖ్య అతిథిగా ఎంపీడీవో సునీత మాట్లాడుతూ గ్రామాల్లోని వ్యర్థాలను తడి, పొడిచెత్తలుగా వేరుచేసి హరిత రాయబారులకు అందించాలన్నారు. గ్రామాన్ని పారిశుధ్య గ్రామంగా తయారుచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎసెట్, ఐటీసీ అనీల్‌కుమార్, ఏపీవో మేరీ, కో-ఆర్డినేటర్ శ్రీనివాస్, ట్రైనర్ బొల్లయ్య, సీవో అనీల్ కుమార్, ఏసోబు తదితరులు పాల్గొన్నారు.

మూడు ఎకరాల్లో దెబ్బతిన్న పత్తి పంట పీకివేత



పత్తి పంటను ట్రాక్టర్‌తో తొలగిస్తున్న రైతు

పెదకూరపాడు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి పంట పూర్తిగా దెబ్బతినటంతో బుధవారం మూడు ఎకరాల పత్తిని పెదకూరపాడుకు చెందిన రైతు షేక్ మాబూ ట్రాక్టర్‌తో తొలగించారు. చేలో పత్తి వచ్చే దశలో అకాల వర్షాల కారణంగా దిగుబడి పూర్తిస్థాయిలో తగ్గి పత్తికాయలు కుళ్ళిపోయాయి. మూడు ఎకరాల పత్తిలో 11 క్వింటాళ్ళ పత్తి మాత్రమే వచ్చిందని, రూ.1.50 లక్షలు పెట్టుబడి పెట్టినా ఉపయోగం లేక పోవటంతో పత్తి పంటను తొలగించానని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

స్వీట్ల తయారీ దుకాణాల తనిఖీ

సత్తెనపల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో స్వీట్ల తయారీ దుకాణాలను మునిసిపల్ అధికారులు, సచివాలయ ఉద్యోగులు తనిఖీచేశారు. స్వీట్ల తయారీలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయసారథి పాల్గొన్నారు.

అత్యవసర వైద్యశిబిరం ఏర్పాటు



వైద్యశిబిరం ప్రారంభోత్సవంలో ఆర్డీవో మురళీకృష్ణ

కారంపూడి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పల్నాటి వీరారాధన ఉత్సవాలను పురస్కరించుకొని స్థానిక వీరుల దేవాలయ ప్రాంగణంలో బుధవారం అత్యవసర వైద్యశాలను ఏర్పాటుచేశారు. ఈ వైద్యశాలను గురజాల ఆర్డీవో మురళీకృష్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లునాయక్, డీఎంహెచ్‌వో రవి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి రాంబాబు, వైద్యాధికారులు రమ్య, లక్ష్మీ మౌనిక, నోడల్ అధికారి హనుమకుమార్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కుటుంబంలో ఓట్లన్నీ ఒకేచోట ఉండేలా చూడండి

మాచవరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గతంలో ఒక కుటుంబానికి చెందిన ఓట్లు వేర్వేరు పోలింగ్‌బూత్‌లలో ఉండేవని, ఇక నుంచి ఒకేచోట ఉండేలా బీఎల్‌వోలు చర్యలు తీసుకోవాలని గురజాల ఆర్డీవో మురళీకృష్ణ సూచించారు. బుధవారం మాచవరం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వోలకు ఒకరోజు శిక్షణా కార్యక్రమంలో ఆయన బీఎస్‌లోలకు పలు సూచనలుచేశారు. కార్యక్రమాన్ని ఆర్డీవో కార్యాలయ డీటీ సుబ్బారావు నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, డీటీ స్రవంతి, ఆర్ఐ ముక్కంటి పాల్గొన్నారు.

అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు త్వరపడాలి

● ఏపీసీపీడీసీఎల్ ఈఈ ఎన్.సింగయ్య

రెంటచింతల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు విద్యుత్ వినియోగదారులు త్వరపడాలని ఏపీసీపీడీసీఎల్ ఈఈ నూతలపాటి సింగయ్య కోరారు. బుధవారం రెంటచింతల సబ్‌స్టేషన్‌లో జరుగుతున్న ఆర్డీఎస్ఎస్ పనులను పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ డిసెంబర్ 31 వరకు క్రమబద్ధీకరణకు అవకాశం ఉందన్నారు. తమ సబ్ డివిజన్ పరిధిలో 11 మండలాల నుంచి ఇప్పటి వరకు 3300 మంది సర్వీస్ కనెక్షన్లు వున్నవారు దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఏఈ మస్తాన్‌వలి, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

ఆవాస్ సర్వేలో పేర్లు నమోదు చేసుకోవాలి

● హౌసింగ్ ఏఈ బాబురావు

కారంపూడి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గృహాలు నిర్మించుకోవాలనుకునే అర్హులైన లబ్ధిదారులు ఆవాస్ సర్వేలో పేర్లు నమోదు చేసుకోవాలని హౌసింగ్ ఏఈ మల్లెల బాబురావు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోవాలనుకునే పేదలు మీ గ్రామ పరిధిలోని సచివాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈనెల 30వ తేదీతో గడువు ముగుస్తుందన్నారు.

బహిరంగ ప్రకటన

మా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, పిడుగురాళ్ల బ్రాంచ్ వారి సూచనలు పొంది యిందుమూలముగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా... తెప్పాల లక్ష్మారెడ్డి గారి కుమారుడు తిరుపతిరెడ్డి గారి ఆస్తిని తనఖా పెట్టుకొని ఋణము పొందుటకు సంప్రదించినారు. కావున ఈ దిగువ షెడ్యూలు ఆస్తికి సంబంధించి ఎవరికైనా అభ్యంతరములు, క్లయిములు ఉన్నచో 7 రోజులలోపు తెలియ చేయవలయును. ఎట్టి అభ్యంతరములు, క్లయిములు రానిచో మా క్లయింట్ సదరు తెప్పాల తిరుపతిరెడ్డి గారికి ఋణం మంజూరు చేయును. షెడ్యూలు : నరసరావుపేట రి.జి యిలాకా, మాచర్ల సబ్ యిలాకా, మాచర్ల మున్సిపాలిటీ యిలాకా, మాచర్ల 15వ వార్డులో, మాచర్ల డి.నెం. 663/2 బి రులో వారు హక్కు కలిగి డోర్ నెం. 15-2-150రు అసెస్‌మెంట్ నెం. 1022005485రులో సగ భాగము దక్షిణం వైపున నీకు విక్రయించి స్వాధీనపరచిన ఆర్.సి.సి. లోగిలిలో సగ భాగమునకు హద్దులు : . తూర్పు : పఠాన్ మస్తాన్ ఖాన్ లోగిలి. అ.26.4 అం.లు (40 లింకులు), దక్షిణం : 30 లిం.లు బజారు అ.16.5అం.లు (25 లింకులు) పడమర : అలేటి మరియమ్మ స్థలం అ.26.4 అం.లు (40లిం.లు), ఉత్తరం : ఈ రోజున నేను కొంతంపాటి రత్నకుమారికి విక్రయించిన ఉత్తరం వైపున లోగిలి-అ.16.5 అం.లు (25 లింకులు). ఈ హద్దులలో 48.4 చ.గల స్థలముయిందులో 214 చదరపు అడుగులలో ఆర్.సి.సి. శ్లాబుతో నిర్మించిన యిల్లు. ఈ ఆస్తి కి సంబంధించిన DOC No: 4696/2020, SRO. మాచర్ల

లంకా విజయకుమార్, లంకా వంశీకృష్ణ, న్యాయవాదులు, 2వ లైను, రవీంద్ర నగర్, గుంటూరు. సెల్ నెం.9030595227, 9848052914

రక్తికట్టిన రాచగావు

ప్రారంభమైన వీరారాధన ఉత్సవాలు



కారంపూడి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పల్నాటి వీరారాధన ఉత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. పీఠాధిపతి తరుణ్ చెన్నకేశవ అయ్యవారిని ఆయన ఇంటి దగ్గర నుంచి వీరాచారవంతులు ఊరేగింపుగా వీర్ల దేవాలయానికి తీసుకొచ్చారు. పలు జిల్లాల నుంచి వచ్చిన వీరాచారవంతులు తమ ఆయుధాలను నాగులేటిలోని గంగధార మడుగులో స్నానమాచరింపజేసి నూతన వస్త్రాలను అలంకరింపజేసి వీరుల ఆలయంలో ఉంచి పూజలు జరిపారు. పూజల అనంతరం పీఠాధిపతి కోటగోడ ముఖద్వారంపై ఎర్రజెండా ఎగరవేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఆనాడు మాచర్ల, గురజాల రాజులు యుద్ధానికి సిద్ధం కమ్మని యుద్ధభూమిలో ఎర్రజెండా ఎగరవేయడాన్ని సూచికగా పీఠాధిపతి ఎర్రజెండాను ఎగరవేశారు. అనంతరం రాచగావు మంటపంలో పీఠాధిపతిని కంకణధారిని చేశారు. మేకపోతును గావు పట్టినట్టు నాటకీయంగా నిర్వహించారు. వీరావిద్యావంతులు మంటపంలో రాచగావు కథను గానం చేశారు. ఈ కార్యక్రమంలో పీఠం నిర్వాహకుడు బొగ్గరం విజయ్‌కుమార్ అయ్యవారు, గ్రామ పెద్దలు, వీరాచారవంతులు పాల్గొన్నారు.

పల్నాటి చరిత్ర ఘనమైంది

● ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి

పల్నాటి చరిత్ర ఎంతో ఘనమైందని, ఇక్కడి చారిత్రక చిహ్నాలను భద్రపరిచి భావితరాలకు అందిద్దామని మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మనందరెడ్డి అన్నారు. బుధవారం కారంపూడిలో వీరారాధన ఉత్సవాలలో ఆయన హాజరై అంకాళమ్మ, చెన్నకేశవస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, 1184లో జరిగిన పల్నాటి యుద్ధానికి శైవ, విష్ణు మతాల సంఘర్షణే కాకుండా రాజ్యకాంక్ష, దాయాదుల పోరు దాగి ఉందన్నారు. మహాభారతంలో పాచికల ఆటలో రాజ్యాన్ని పోగొట్టుకొని పాండవులు అరణ్య వాసానికి వెళ్లినట్లే, కోడి పందేలలో నాగమ్మ కుయుక్తులతో ఓడి మాచర్ల రాజ్యాన్ని వదిలి మలిదేవరాజు అరణ్య వాసానికి వెళ్లారన్నారు. ఆనాటి రాజులు యుద్ధభూమిగా కారంపూడిని ఎంచుకొని 18 రోజులపాటు ఉద్యమం సాగించి వీరులయ్యారన్నారు. ఆ వీరులకే ఉత్సవాలు జరపడం కొన్ని వందల సంవత్సరాలుగా ఆనవాయితీగా వస్తోందన్నారు. బ్రహ్మనాయుడు గుత్తికొండ బిలానికి తపస్సుకు వెళుతూ బ్రాహ్మణులైన పిడుగు వంశం వారిని పీఠాధిపతులుగా వంశపారపర్యంగా నిర్ణయించి వెళ్లడంతో వారే ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి వెంట గురజాల డీఎస్పీ జగదీష్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, టీడీపీ యువనేత గౌతమ్‌రెడ్డి, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి పంగులూరి పుల్లయ్య, మండల అధ్యక్షుడు గోళ్ల సురేష్ యాదవ్, కజ్జం సైదయ్య, కొమెర అనంతరాములు, బొల్నేడి శ్రీనివాసరావు, చప్పిడి రాము, కర్నా సైదారావు, బూసా రామాంజనేయులు, సర్పంచ్ సరస్వతి బాలు నాయక్, ఉన్నం లక్ష్మీనారాయణ, బొమ్మిన శేషగిరిరావు, కలికల బాలకృష్ణ, తోట అల్లయ్య, ఎస్పీఆర్ కృష్ణ, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో గంటా శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ వాసు తదితరులు ఉన్నారు.



ప్రత్యేక పూజలో ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి

బై.. బై.. అమెరికా

అమెరికాలో విదేశీ ఉద్యోగులపై ఆంక్షలు, వీసా నిర్ణయాల్లో మార్పులు, చిన్నా చితక తప్పులకు కూడా కఠిన చర్యలు.. ఈ పరిస్థితులు ఎన్నో భారతీయ కుటుంబాలను మరోసారి ఆందోళనలోకి నెడుతున్నాయి. అమెరికా ఉద్యోగ ప్రపంచం కలలను నెరవేర్చుకో వాలనుకున్న వేలాది మందిలో పల్నాడు, గుంటూరు జిల్లాకు చెందిన కొందరు యువకులు గత కొన్నేళ్లుగా అమెరికాలో ఉద్యోగాలు చేస్తూ స్థిరపడే ఆలోచనలో ఉన్నారు. కానీ వీసా ప్రమాణాలపై అమెరికా ప్రభుత్వం తీసుకున్న కఠిన నియమాలు, చిన్న తప్పుకి కూడా కఠినంగా స్పందిస్తున్న ఇమ్మిగ్రేషన్ అధికారుల తీరు వారి కలలను తలకిందులు చేసింది.





- చిన్న తప్పులకు పెద్ద శిక్షలు వేస్తున్న అగ్ర దేశం
- ఆందోళనతో స్వదేశానికి తిరిగి వస్తున్న యువత
- అమెరికా ప్రభుత్వ నిర్ణయాలతో తలకిందులైన జీవితాలు
- తల్లిదండ్రుల్లో ఆవేదన.. యువతలో ఆందోళన
- భవిష్యత్తుపై అంతులేని మదనంలో యువకులు

(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

అమెరికాలో వీసా పొడిగింపులు, నియమావళిలో మార్పులు, ఉద్యోగ ధ్రువీకరణలో ఏ చిన్న లోపం ఉన్నా అది పెద్ద సమస్యగా మారుతోందని అక్కడి ఇండియన్ కమ్యూనిటీ చెబుతోంది. దరఖాస్తుల్లో చిన్న వివరాలు తప్పిపోయినా, ప్రాజెక్టు వివరాలు మ్యాచ్ కాకపోయినా, అదనపు స్పష్టీకరణ ఇచ్చినప్పటికీ వీసాలు రద్దు కావడం వంటి అనుభవాలతో చాలామంది భారతీయులు స్వదేశం చేరుతున్నారు. ఉద్యోగంలో మార్పులు, కంపెనీ డాక్యుమెంటేషన్‌లో చిన్న అస్పష్టత, వర్క్ పర్మిట్ రెన్యువల్‌లో ఆలస్యం వంటి ఈ చిన్న విషయాలే పెద్ద సమస్యగా మారి, వారి వీసాలు ప్రశ్నార్థక స్థితికి చేరాయి. చివరకు వారికి స్వదేశం రావడం తప్ప మరో మార్గం లేకుండా పోయింది.

పెరుగుతున్న తిరిగొస్తున్న వారి సంఖ్య

ఇటీవలి నెలల్లో వీసా ప్రక్రియ కఠినతరం కావడంతో అమెరికా నుంచి భారత్ తిరిగొస్తున్న భారతీయుల సంఖ్య పెరుగుతోందని ఇండియన్ కమ్యూనిటీ అసోసియేషన్లు చెబుతున్నాయి. కొంత మందికి వీసా రెన్యువల్‌లో సమస్యలు, మరికొంత మందికి ఉద్యోగ మార్పుల కారణంగా డాక్యుమెంటేషన్ ఇష్యూలు, మరికొందరికి ఇమ్మిగ్రేషన్ వేలిముద్రలు, అడ్రస్ అప్‌డేట్స్ వంటి చిన్న పొరపాట్లే పెద్ద అడ్డంకులుగా మారుతున్నాయి. ట్రంప్ పాలసీల ప్రభావం, అక్రమ వలసలపై మరింత కఠిన వైఖరి, ఇవి కలిపి చాలా మంది భారతీయులకు అస్థిరత కలిగిస్తున్నాయి. అమెరికాలో చదువుకుంటున్న విద్యార్థులే కాక, ఐటీ, హెల్త్‌కేర్, రీసెర్చ్ రంగాల్లో పనిచేసే చాలా మందికి వీసా నిర్ణయాలు ఇప్పుడు భయం కలిగిస్తున్నాయి. ఇక ముందేమవుతుందో తెలియని పరిస్థితి కన్నా స్వదేశం వస్తేనే మనసు ప్రశాంతంగా, తాము సురక్షితంగా ఉండగలమని పలువురు భావిస్తున్నారు.

● విద్యా రుణం సంగతి...

పిల్లలు విదేశాలకు వెళ్తున్నారన్న ఆనందంతో తల్లిదండ్రులు బ్యాంకుల్లో రూ. లక్షలు విద్యారుణం తీసుకున్నారు. అక్కడ ఏదో ఒక ఉద్యోగం చేసి ప్రతి నెల ఎంతో కొంత జమ చేసేవారు. ఇప్పుడు పూర్తిగా ఇంటికి వచ్చేస్తే అన్న ప్రశ్నకు ఇటు తల్లిదండ్రులు, అటు యువకుల వద్ద సమాధానం లేదు. ఉన్న ఆస్తిని అమ్మి ఆ రుణం చెల్లిస్తామని తల్లిదండ్రులు చెబుతున్నారు. పిల్లలు తమ కళ్ల ముందుంటే చాలని అంటున్నారు. అదీ నిజమేగా దేశం కాని దేశంలో పొరపాటున ఇరుక్కు పోతే చచ్చేంత పని అవుతుంది. అటువంటి ఆపద రాక ముందే మేలుకుంటే మంచిదే కదా..!

● నీరు గారిన ఆశలు

అమెరికాలో స్థిరపడాలన్న ఆశలు నీరుగారి అక్కడి నుంచి భారతదేశానికి తిరిగొచ్చిన యువకుల కుటుంబాల్లో తీవ్ర ఆవేదన కనిపిస్తుంది. అదే సమయంలో పిల్లలు తమ దగ్గరలోనే ఉన్నారనే ధైర్యం వారిలో ఉంటోంది. ఇలా రెండు రకాల భావోద్వేగాల మధ్య పెద్దలు నలిగిపోతుంటే.. మళ్లీ విదేశాల్లో ఉద్యోగం సాధించాలా? లేక ఇక్కడే కొత్త అవకాశాలు వెతుక్కోవాలా? అన్న ప్రశ్నలతో యువకులు కొత్త జీవన ప్రణాళికలు రచిస్తున్నారు.

లెక్కే లేదు..అమలు ఇంకెక్కడ?

(5వ పేజీ తరువాయి)

రాష్ట్ర పురపాలక శాఖ కార్యదర్శి ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. కొన్ని మున్సిపాలిటీల్లో కమిటీలు వేసి చేతులు దులుపుకుంటే, చాలా మున్సిపాలిటీల్లో వీధి కుక్కలు, పెంపుడు కుక్కల లెక్కే సరిగా లేదంటే.. ఉత్తర్వుల అమలు తీరు ఏమేర ఉందనేది అర్థమవుతోంది.

శిథిలావస్థలో కేంద్రాలు..

స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్‌కు అవసరమైన కేంద్రాలు అందుబాటులో లేవు. ఉదాహరణకు తెనాలి పట్టణానికి సంబంధించి వ్యాక్సినేషన్, సంరక్షణ కేంద్రాన్ని రూ.12 లక్షలతో ఏడేళ్ల క్రితం కంపోస్టు యార్డులో నిర్మించారు. దీనిని సరిగా వినియోగించకపోవడంతో షెడ్‌లు శిథిల స్థితికి చేరాయి. పరికరాలు కూడా పనికి రాకుండా పోయాయి. ఇదే పరిస్థితి మిగిలిన మున్సిపాలిటీల్లోనూ ఉంది. కొన్ని మున్సిపాలిటీల్లో అసలు కేంద్రాలే ఏర్పాటు కాలేదు. ఉన్న కేంద్రాల్లో డాక్టర్లు, ఇతర సిబ్బంది నియామకం లేదు.

కమిటీలు ఇలా..

సుప్రీం ఆదేశాల మేరకు.. శునకాల నుంచి పిల్లల రక్షణకు తీసుకుంటున్న చర్యలను స్థానిక సంస్థలు వెల్లడించాలి. ఫిర్యాదులను తీసుకుని.. తక్షణం స్పందించే వ్యవస్థను ఏర్పాటు చేయాలి. నిబంధనల అమలు కోసం ఆరుగురు సభ్యులతో కమిటీ వేయాలి. పశు సంవర్థక, వైద్య ఆరోగ్య శాఖలు, స్వచ్ఛంద సేవా సంస్థల నుంచి సభ్యులను నియమించాలి. ఈ కమిటీలకు పురపాలికల్లో కమిషనర్, పంచయతీల్లో కార్యదర్శి చైర్మన్‌గా ఉంటారు.

- తెనాలి పట్టణంలో 1,450 వీధి కుక్కలు మాత్రమే ఉన్నాయనడం ఆశ్చర్యం కలిగించే విషయం. వీటిలో 350 కుక్కలకు మాత్రమే ఆపరేషన్లు చేయాలని ఒక లెక్క చెబుతోంది. అసలు స్టెరిలైజేషన్ పనిచేయకపోతే ఏ విధంగా మిగిలిన వాటికి వ్యాక్సిన్, ఆపరేషన్‌ల ప్రక్రియ పూర్తిచేశారనేది సందేహం.
- సత్తెనపల్లి మునిసిపాలిటీ పరిధిలో రెండు వందలకు పైగా కుక్కలకు వ్యాక్సినేషన్ పూర్తి చేశారు. మరో ఆరు వందల వరకు కుక్కలు రోడ్లపై తిరుగుతున్నాయి. సుప్రీం ఆదేశాల మేరకు మునిసిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయ సారథి ఆపరేషన్ థియేటర్‌ను మరింత అభివృద్ధి చేస్తున్నారు. ఆపరేషన్ అనంతరం కుక్కలను ఉంచేందుకు షెల్టర్ నిర్మాణానికి ప్రతిపాదనలను సిద్ధం చేశారు. ఈ నెల చివరిలో జరిగే కౌన్సిల్ సమావేశంలో ఆమోదం పొందగానే నిర్మాణ పనులు ప్రారంభించ నున్నట్టు అధికారులు తెలిపారు.
- నరసరావుపేట మునిసిపాలిటీల పరిధిలో సమారు 450 కుక్కలను మునిసిపాలిటీ అధికారులు గుర్తించారు. ఇప్పటికి 165 కుక్కలను పట్టి వాటికి స్టెరిలైజేషన్ చేశారు. అనంతరం వాటిని తిరిగి వాటి అసలు స్థానాల్లోనే వదులుతున్నారు. నిర్దేశిత లక్ష్యాల సాధనపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు సమీక్షిస్తున్నారు.
- బాపట్లలో వీధికుక్కల సంతానోత్పత్తి నియంత్రణకు రైలుపేట స్మశానవాటికలో శస్త్ర చికిత్స శిబిరం ఏర్పాటు చేశారు. రూ.6 లక్షలు వెచ్చించి షెడ్, బోన్‌లు, ఏసీ, ఆపరేషన్ పరికరాలు ఏర్పాటు చేశారు. పట్టణంలో 1000 వీధి కుక్కలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అందులో 800 కుక్కలకు శస్త్ర చికిత్స చేసినట్లు రికార్డుల్లో నమోదు చేశారు. అయినప్పటికి సూర్యలంక రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు, ఎల్ఐసీ కార్యాలయం రోడ్డు, జీబీసీ రోడ్డు, జమ్ములపాలెంరోడ్డు తదితర ప్రాంతాల్లో వీధి కుక్కల సంచారం ఎక్కువగా ఉంది. శానిటరి ఇన్‌స్పెక్టర్ సయ్యద్ నజీర్‌ను వివరణ కోరగా స్పష్టమైన ఆదేశాలు వచ్చిన తర్వాత షెల్టర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.
- అద్దంకి పట్టణంలో 420 కుక్కలు ఉన్నట్లు మున్సిపల్ అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. బుధవారం వరకు 96 కుక్కలను సత్తెనపల్లికి పంపినట్లు మున్సిపల్ కమీషనర్ రవీంద్ర తెలిపారు. వారం రోజుల్లో అన్నింటిని పట్టుకొని వ్యాక్సినేషన్ చేయిస్తామన్నారు. అయితే స్థానికుల నుంచి అభ్యంతరాలు వస్తుండటంతో ఒకింత ఆలస్యం అవుతున్నట్లు తెలుస్తుంది. గ్రామాలలో మాత్రం అధికారులు అసలు పట్టించుకోవడం లేదు.



బాపట్ల : రైలుపేట స్మశాన వాటిక దగ్గర వీధి కుక్కల సంతానోత్పత్తి నియంత్రణ శస్త్రచికిత్స కోసం ఏర్పాటు చేసి ప్రత్యేక శిబిరం

రాగిశాసనంలో...శ్రీశైలం మెట్లు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

రాగి శాసనాలను డీకోడింగ్ చేయగా శ్రీశైలం ఆలయానికి మెట్లు నిర్మించినట్లు కూడా దానిలో ఉందని ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్(మైసూర్) మునిరత్నం రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. చెరుకుపల్లి మండలం పొన్నపల్లి అగ్రహారంలో వెలుగు చూసిన రాగి శాసనాలను సదరు వంశీయులు ఏఎస్ఐకి పంపిన సంగతి తెలిసిందే. చారిత్రక శాసనాలను డీకోడింగ్ చేసే క్రమంలో వాటిలో అనేక ఆసక్తి కరమైన అంశాలు లిఖించి ఉన్నట్లు ఏఎస్ఐ తెలిపింది. ప్రసిద్ధి చెందిన శ్రీశైలం మల్లికార్జున ఆలయానికి మెట్ల నిర్మాణం అంశం కూడా దానిలో పొందుపరచడం జరిగిందన్నారు. ఇదే కాకుండా రెడ్డి రాజుల వంశ వృక్షం వివరాలను కూడా అందులో వివరించారని, మొత్తం సంస్కృతం, తెలుగు లిపిలోనే ఇవన్నీ లిఖించారన్నారు. వేద పండితులంతా కలిసి ఈ శాసనాలను 1,405 శతాబ్దంలో అప్పటి రెడ్డి రాజులకు అందించారని, వాటిని ఆ వంశీయులు భద్రపరచి ఆర్కియాలజీ విభాగానికి అందించడం వల్ల అనేక ఆసక్తికర అంశాలు వెలుగులోకి వస్తున్నాయని ఏఎస్ఐ తెలిపింది. పొన్నపల్లి అగ్రహారానికి చెందిన విద్యా భాస్కర్ అందించిన చారిత్రకక రాగి శాసనాలపై మరింతగా కసరత్తు చేస్తున్నామని డైరెక్టర్ మునిరత్నంరెడ్డి వివరించారు.



ఏఎస్ఐ డీకోడింగ్ చేసిన రాగిశాసనం ఇదే

ప్రకాశం బ్యారేజీ దిగువకు 400 క్యూసెక్కులు



ప్రకాశం బ్యారేజీ దిగువకు విడుదల అవుతున్న కృష్ణానది వరదనీరు

తాడేపల్లి టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల తగ్గించడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి స్వల్పంగా కొనసాగుతోంది. ఎగువన పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుండి 9,293 క్యూసెక్కుల వరద నీరు బుధవారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతుండగా 400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా తూర్పు డెల్టా కాలువకు 4,154, పశ్చిమ డెల్టాకు 4,513, గుంటూరు చానల్‌కు 226 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు తెలిపారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం..

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం బుధవారం నాటికి 585.50 అడుగులు ఉంది. ఇది 298.87 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10వేలు, ఎడమ కాలువ ద్వారా 4,160, ఎస్ఎల్‌బీసీ ద్వారా 600, మొత్తం ఔట్‌ఫ్లో 14,760 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు 14,760 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతలలో..

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులో బుధవారం 41.98 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి వెయ్యి క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా రెండు వేలు, లీకుల ద్వారా 400, మొత్తం 2,400 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు.

గజ.. గజ...

- ఉమ్మడి జిల్లాలో పెరిగిన చలి తీవ్రత
- ఆస్తమా రోగులు, వృద్ధులు, చిన్నారుల అవస్థలు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు



సత్తెనపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాల్లో వారం రోజులుగా చలి తీవ్రత అధికమైంది. చలి తీవ్రతతో ప్రజలు గజగజ వణికి పోతు న్నారు. ఇప్పుడే ఇలా ఉంటే రానున్న రోజులు ఎలా ఉంటాయోనని భయపడు తున్నారు. రోజు రోజుకు పెరుగుతున్న చలి గాలులతో అడుగు బయట పెట్టాలంటేనే జంకుతున్నారు. చలి తీవ్రతతో వృద్ధులు, పిల్లలు, ఆస్తమా రోగులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు పొగమంచుతో కూడా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

● రోగుల వెతలు

చిన్నారులు, వృద్ధులతో పాటు ఆస్తమా రోగులు ఓ వైపు చలికి, మరో వైపు పొగ మంచు ప్రభావంతో అల్లాడిపోతున్నారు. ఆస్తమా, గొంతు నొప్పి, జలుబు, దగ్గు, ఆయాసం కేసులు పెరుగుతున్నాయి. సీఓపీడీ, అలర్జీ, న్యుమోనియా తదితర శ్వాస కోశ వ్యాధుల ముప్పు పొంచి ఉంది. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిపై వైరస్‌లు త్వరగా దాడి చేస్తాయని వైద్యులు చెబుతున్నారు. పొగ మంచు ఫలితంగా ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని, అత్యవసరమైతే తప్ప వాహనాలతో బయటకు వెళ్లకూడదని అధికారులు చెబుతున్నారు. జాతీయ రహదారిలో రోజంతా తిరుగాడే వాహన డ్రైవర్లు మాత్రం జాగ్రత్తగా ముందుకు వెళ్లాలన్నారు. రాత్రి పొద్దు పోయాక మంచు దట్టంగా కురిసే సమయంలో పెద్ద వాహనాలను నిలిపి వేయాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ద్విచక్ర వాహనాలతో ప్రయాణించకూడదని చెబుతున్నారు. చల్లటి గాలులకు శరీరం చల్లగా పొడి బారినట్టు మారిపోతుంది. పెదాలు పగిలిపోయి మొఖం కాంతిహీనంగా తయారవుతుంది. అరికాళ్ళ పగుళ్ళు ఏర్పడతాయి. శరీరంలో తేమ శాతం తగ్గటంతో చర్మ రక్షణ తగ్గి దురదలు వస్తాయి. ఈ తరహా సమస్యలు దీర్ఘకాలిక రోగుల్లో మరింత ఎక్కువగా కన్పిస్తాయని వైద్యులు చెబుతున్నారు. వాతావరణ మార్పుతో వారం నుంచి రెండు వారాల పాటు ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉందని వారు అంటున్నారు. న్యుమోనియా, ఆస్తమా, సీఓపీడీ, గుండె వ్యాధులతో బాధ పడే వారు మరింత జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. చల్లటి ప్రదేశంలో తిరిగినా, చల్లటి ఆహారం తీసుకున్నా సమస్య పెరుగుతుందని హెచ్చరిస్తున్నారు. క్రమం తప్పకుండా మందులు వాడాలని పేర్కొంటున్నారు. కాగా, సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు అక్టోబరు నెలలో జలుబు, దగ్గు, జ్వరం, ఆస్తమా సమస్యలతో 800 మంది వరకు రోగులు చికిత్స నిమిత్తం వచ్చారు.

● జాగ్రత్తలు తప్పనిసరి



చలి కాలంలో చిన్న పిల్లల విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. ఇళ్ళల్లో ఉష్ణోగ్రతలు తక్కువగా ఉంటే పిల్లలు శ్వాస తీసుకోవటం ఇబ్బందిగా ఉంటుం ది. మంచుపడే సమయంలో పిల్లలను బయటకు తీసుకు వెళ్లొద్దు. తప్పనిసరైతే స్వెట్లర్లు, మంకీ క్యాపులు వాడాలి. ఇన్‌ఫెక్షన్‌లు సోకే అవకాశం ఉంటుంది. పిల్లల ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా ఉండాలి. తరచూ జలుబు, దగ్గు వస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించి చికిత్స చేయించాలి

-డాక్టర్ లక్ష్మణరావు, చిన్న పిల్లల వైద్యులు, ఏరియా వైద్యశాల, సత్తెనపల్లి

● వేడి నీరు తాగాలి



ఆస్తమా రోగులు, చెవి, ముక్కు, గొంతు సమస్యలతో ఉన్న వారు చలి కాలంలో జాగ్రత్తగా ఉండాలి. నీరు వేడి చేసి వడబోసుకొని తాగాలి. వెచ్చని దుస్తులు ధరించాలి. శరీరం పూర్తిగా కవర్ అయ్యే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి. చల్లటి పానీయాలు, ఐస్ క్రీమ్‌లు తీసుకోవద్దు. గొంతు నొప్పి ఉన్న వారు రోజుకు రెండు సార్లు వేడి చేసిన నీటిలో కొంచెం ఉప్పు వేసి వాటిని పుక్కిలించి ఉమ్మి వేయాలి.

-డాక్టర్ గిరిరాజు, ఎండీ జనరల్, ఏరియా వైద్యశాల సత్తెనపల్లి

గర్భిణీలు జాగ్రత్తలు తీసుకోవాలి



చలి తీవ్రత పెరుగుతున్నందు వల్ల ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడంతో మహిళల్లో హార్మోన్లపై ప్రభావం పడుతుంది. థైరాయిడ్, ఎలర్జీ ఉన్న వారికి ఇది మరింత సమస్యగా ఉంటుంది. గర్భిణీల్లో బీపీ పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఎప్పటికప్పుడు బీపీ చెకప్ చేయించుకోవాలి. ప్రసవించిన మహిళలు వేడి నీరు ఎక్కువగా తీసుకోవాలి. సూర్యరశ్మి కనీసం 20 నిమిషాలు శరీరానికి తగిలేలా చూడాలి.

- డాక్టర్ సుజాత, గైనకాలజిస్టు, ఏరియా వైద్యశాల సత్తెనపల్లి

23న ఆర్టీసీ కార్మికులకు కంటి వైద్య శిబిరం

చిలకలూరిపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ఈ నెల 23న ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి సహకారంతో ఆర్టీసీ కార్మికులకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు కంచర్ల శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. శిబిరం గోడపత్రికలను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆవిష్కరించారు. శిబిరాన్ని ఆర్టీసీ సిబ్బందితో పాటు, ఇతరులు కూడా ఉపయోగించుకోవాలని ప్రత్తిపాటి కోరారు. కార్యక్రమంలో జనసేన నేత టి.రాజారమేష్, ఆర్టీసీ డీఎం రాంబాబు, టీఎన్‌టీయూసీ నాయకులు కె.శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు, ఎ.వరప్రసాద్, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

సౌదీలో రోడ్డు ప్రమాదం బాధాకరం: చీఫ్ విప్ జీవీ

వినుకొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సౌదీ అరేబియాలోని మదీనాలో జరిగిన రోడ్డు ప్రమాదం బాధాకరమని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. రోడ్డు ప్రమాదంలో 45మంది మృతి చెందటం బాధాకరమన్నారు. మృతుల పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని, విషాదకర సమయంలో బాధిత కుటుంబాలకు ధైర్యం, ఓదార్పు కలగాలన్నారు.

డ్రైవింగ్ సెంటర్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

నరసరావుపేట కల్చరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజనలో భాగంగా డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్ కోసం ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా రవాణాధికారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10 లక్షల జనాభాకు ఒక డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేసుకునేందుకు నిర్ణయించామన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు డీపీఆర్ నకలు, ఇతర అనుబంధాలు నరసరావుపేట జిల్లా రవాణాధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఇతర వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

మాజీ జడ్పీటీసీ చిగురుపాటి ఆదినారాయణ మృతి

రొంపిచర్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పరగటిచర్ల గ్రామానికి చెందిన చిగురుపాటి ఆదినారాయణ (86) బుధవారం మృతిచెందారు. ఈయన మండల ఎంపీపీగా, జడ్పీటీసీగా, నరసరావుపేట మార్కెట్ యార్డు చైర్మన్‌గా, సర్పంచ్‌గా సేవలు అందించారు. మాజీ శాసన సభాపతి దివంగత డాక్టర్ కోడెల శివప్రసాదరావుకు ముఖ్య అనుచరుడిగా ఉన్నారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు బుధవారం ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన వెంట రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహణ కార్యదర్శి పొనుగోటి శ్రీనివాసరావు, బొక్కిసం శ్రీనివారావు, కామినేని రంగారావు తదితరులు ఉన్నారు.

సైబర్ భద్రతపై అవగాహన

నాదెండ్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమీన్‌సాహెబ్‌పాలెంలో ఎంఎం కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ భద్రత - మీరు క్లిక్ చేసే ముందు ఆలోచించండి అనే థీమ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి కే షాలెంరాజు, ఫ్యాకల్టీ సభ్యులు జే శంకర్‌యాదవ్, వలంటీర్లు అజయ్‌కుమార్, అమీర్, హేమలత, ఉపేంద్ర, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

వినుకొండటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విఠంరాజుపల్లి, బ్రాహ్మణపల్లి, నరగాయపాలెం, వెంకుపాలెం, జాలలపాలెం గ్రామాల్లో లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ కోత విధించనున్నట్లు ఏడీఈ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఉపాధి రికార్డులను సక్రమంగా నిర్వహించాలి: ఎంపీడీవో

నూజెండ్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీవో పీ ఉమాదేవి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ పనులపై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమాదేవి మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు వలసలను నివారించే విధంగా పనులు చూపించటంలో అధికారులు, సిబ్బంది చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో ఆంజనేయ రాజు, జేఈ వెంకటేశ్వరరావు, పీఏలు భాస్కర్‌రెడ్డి, సతీష్, ఉపాధి హామి సిబ్బంది పాల్గొన్నారు.

హిడ్మా ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించాలి

నరసరావుపేట టౌన్. నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): హిడ్మా ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించాలఅని పీడీఎం నాయకుడు నల్లపాటి రామారావు బుధవారం డిమాండ్ చేశారు. దేశంలో నిరుద్యోగం, ఆకలి, అసమానతలు ఉన్నంత కాలం విప్లవ పోరాటాలు ఉంటాయన్నారు. విప్లవకారులు చేస్తున్న పోరాటాలకు ప్రజలు మద్దతు ఇవ్వాలని, రాజ్యం చేస్తున్న దాడులను ప్రజలందరూ ఖండించాలన్నారు.

మన పరిశుభ్రత-మన ఆరోగ్యంపై అవగాహన

వినుకొండ టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ టాయిలెట్స్ డే సందర్భంగా మన పరిశుభ్రత - మన ఆరోగ్యం అనే అంశంపై స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్ మాట్లాడుతూ వ్యాధుల నుంచి మనల్ని మనం రక్షించుకోవడానికి, వాతావరణాన్ని శుభ్రంగా ఉంచుకోవడానికి పారిశుధ్యంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.వెంకటరావమ్మ, వైస్ ప్రిన్సిపాల్ నిర్మలాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు బకాయిలు మంజూరు చేయాలి

● డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు బకాయిలు వెంటనే రిలీజ్ చేయాలని పల్నాడు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్య నిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన పత్రికా విలేకరుల సమావేశంలో డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల పాడేరు మెడికల్ కళాశాలలో 50 మెడికల్ సీట్లను కోల్పోయామన్నారు. ఎన్ఎంసీ అడిగిన సమాచారాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వకపోవటం వల్ల ఎన్ఎంసీ 50 స్టీలను రద్దు చేసిందన్నారు. అదేవిధంగా పులివెందులలో 100 శాతం పూర్తయిన మెడికల్ కళాశాలను ప్రారంభించడానికి ఈ ప్రభుత్వం విముఖత చూపి, మాకు మెడికల్ సీట్లు వద్దంటూ లేఖ రాసిన ఘనత ఈ కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. అంతేకాకుండా ఈ మెడికల్ కళాశాలకు గత ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కొనిపెట్టిన మెడికల్ పరికరాలను వేరే కళాశాలలకు, వేరే హాస్పటల్‌కు తరలిస్తున్నారని ఆరోపించారు. ఆరోగ్యశ్రీ నెట్వర్క్ హాస్పటల్ వారు గత నెలలో 25రోజులు సేవలు ఆపివేసినా, ఇంతవరకు ఒక్క రూపాయి కూడా బకాయిలు విడుదల చేయలేదని ఆరోపించారు. కలెక్టర్లతో మీటింగులు పెట్టించి ఆరోగ్యశ్రీ ఆసుపత్రులలో అనధికారంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రిని తక్షణమే మంత్రివర్గం నుంచి తొలగించాలని, 70 శాతం పూర్తయిన పిడుగురాళ్ల మెడికల్ కళాశాలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎస్టీయూ నూతన కౌన్సిల్ ఎన్నిక

చిలకలూరిపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ వార్షిక కౌన్సిల్ సమావేశంలో చిలకలూరిపేట, నాదెండ్ల, యడ్లపాడు మండలాలు, పట్టణానికి సంబంధించి నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. పట్టణ శాఖ అధ్యక్షుడిగా .కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా వి.అజయ్‌ప్రకాష్, చిలకలూరిపేట మండల అధ్యక్షుడిగా మస్తాన్‌వలి, ప్రధాన కార్యదర్శిగా రమణనాయక్, యడ్లపాడు మండల అధ్యక్షుడిగా జి.కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా సతీష్‌కుమార్, నాదెండ్ల మండల అధ్యక్షుడిగా మక్బుల్ బాషా, ప్రధాన కార్యదర్శిగా దుర్గాప్రసాద్ ఎన్నికయ్యారు.

రైతు ప్రగతి కోసం కూటమి ప్రభుత్వం కృషి



అన్నదాత సుఖీభవ చెక్కులు పంపిణీ చేస్తున్న చీఫ్ విప్, జీవీ ఆంజనేయులు, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన తదితరులు

● అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ చెక్కుల పంపిణీలో చీఫ్‌విప్ జీవీ

బొల్లాపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతు ప్రగతి కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ రెండు విడత నిధులను ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ వినుకొండ నియోజకవర్గంలోని 45,898 మంది రైతు కుటుంబాలకు రూ.31.04కోట్లు జమవుతాయన్నారు. బొల్లాపల్లిలో సాగు చేసిన మిరప, పొగాకు పంట పొలాలను సందర్శించి రైతులతో మాట్లాడారు. అర్హత ఉన్న ఏ రైతుకైనా సాయం అందకపోతే టోల్‌ఫ్రీ నెంబరు 155251కి ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పీ మాధురి, తహసీల్దార్ ఏ సుధాకర్, రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పెమ్మసాని నాగేశ్వరరావు, ఏడీఏ రవికుమార్, ఆరికట్ల వాసు దేవరెడ్డి, ఏవో అబ్బూరి అంకారావు, ఎంఈవో పార్వతి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత మార్కెట్ యార్డులో రైతులు, కూటమినేతల సమక్షంలో పీఎం కిసాన్, అన్నదాతా సుఖీభవ నిధుల విడుదల కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ముఖ్యఅతిథిగా బుధవారం పాల్గొని రైతుల బ్యాంకు ఖాతాలకు నిధులు జమచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రత్తిపాటి రెండో విడత అన్నదాత సుఖీభవ కింద నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 21,669 మంది రైతులకు రూ. 14.13 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. చిలకలూరిపేట మండలంలో 8,080, నాదెండ్లలో 8,305 మంది, యడ్లపాడులో 5,284 మంది రైతులకు లబ్ధి చేకూరిందని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరీముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, జిల్లా రైతు అధ్యక్షులు మద్దూరి వీరారెడ్డి, చిలకలూరిపేట, నాదెండ్ల, యడ్లపాడు మండల అధ్యక్షులు పాల్గొన్నారు.



అన్నదాత సుఖీభవ చెక్కును అందజేస్తున్న ప్రత్తిపాటి

● నూజెండ్ల: అన్నదాత సుఖీభవ నిధులు విడదలను రైతు సేవా కేంద్రంలోని టీవీల్లో రైతులు బుధవారం వీక్షించారు. మండలంలో 10,199 రైతు కుటుంబాలకు రూ.7.13కోట్లు బ్యాంక్ ఖాతాల్లో జమచేయటం అభినందనీయమని నూజెండ్ల సొసైటీ చైర్‌పర్సన్ బచ్చు అంజిరెడ్డి అన్నారు.

రొంపిచర్లలో...

రొంపిచర్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పేర్కొన్నారు. బుధవారం స్థానిక మార్కెట్ యార్డులో జరిగిన అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ చెక్కు పంపిణీ కార్యక్రమానికి రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావుతో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నరసరావుపేట నియోజక వర్గానికి సంబంధించి సుమారు 20వేల మందికి రూ.13కోట్ల మేర నగదు జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, మార్కెట్ యార్డు చైర్మన్ మొండితోక రాణి, రామారావు, మండల టీడీపీ అధ్యక్షుడు పల్లెల నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రైతులకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే అరవిందబాబు, గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందాలి



మండల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

● చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

బొల్లాపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందాలని పభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. మండల కేంద్రమైన ఎంపీడీవో కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన మండల స్థాయి సమావేశం ఎంపీడీవో పీ మాధురి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. ప్రభుత్వ పథకాల అమలు తీరుపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో పేదలైన అర్హులు ఉంటే ఈ నెలాఖరులోపు ప్రతి ఒక్కరు ఇంటి స్థలానికి దరఖాస్తు చేసుకోవాలని, నియోజకవర్గంలో అత్యధికంగా బొల్లాపల్లి మండలం ముందుండాలన్నారు. మండలాన్ని హార్టికల్చర్ హబ్‌గా ఏర్పాటు చేస్తామన్నారు. రైతులు పురుగు మందులు తగ్గించి సేంద్రియ వ్యవసాయంపై అడుగులు వేయాలన్నారు. గ్రామాల్లో అధికారులు ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకం ప్రజలకు చేరవేయాలన్నారు. ప్రతి ఒక్కరు సోలార్ ఏర్పాటు చేసుకొని రాయితీ పొందాలన్నారు. కార్యక్రమంలో జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, ఎంపీడీవో పీ మాధురి, తహసీల్దార్ ఏ సుధాకర్, రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పెమ్మసాని నాగేశ్వరరావు, ఏడీఏ రవికుమార్, ఆరికట్ల వాసు దేవరెడ్డి, ఏవో అబ్బూరి అంకారావు, ఎంఈవో పార్వతి, టీడీపీ నాయకులు గోవిందు నాయక్, దాసరి కోటేశ్వరరావు, జీడీసీసీ డైరెక్టర్ పి. వెంకటనారాయణ, హనుమానాయక్, ఎ.రంగయ్య, టి.వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. కోటప్పకొండలోని శ్రీ త్రికోటేశ్వర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం క్రీడా దుస్తులు, క్రీడా సామగ్రి పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయురాలు గుదే క్యాథరిన్ జ్ఞాపకార్థం నిర్వహించారు. ఆమె చేసిన సేవలను స్మరించుకుంటూ పాఠశాల విద్యార్థినులు, విద్యార్థులకు క్రీడా దుస్తులు (ట్రాక్‌సూట్లు), క్రీడా కిట్‌లు, ఇతర అవసరమైన క్రీడా సామగ్రిని ఎమ్మెల్యే అరవిందబాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమం కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కోటప్పకొండలో విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

ఝాన్సీ లక్ష్మీబాయ్, ఇందిరాగాంధీలకు ఘన నివాళి

నరసరావుపేట రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధురాలు, తొలి వీరనారి ఝాన్సీలక్ష్మీబాయ్, భారతదేశ తొలి మహిళా ప్రదాని ఇందిరాగాంధీ జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో జయంతిని ఘనంగా నిర్వహించారు. మండలంలోని కేశానుపల్లి పంచాయతీ పరిధిలోని ఎస్ఆర్‌కేటీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఝాన్సీలక్ష్మీబాయ్, ఇందిరాగాంధీ చిత్రపటాలకు విద్యార్థులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రదానోపాధ్యాయుడు గురులింగం, ఉపాధ్యాయులు సుధాకర్, సుబ్బారావు, ఫాతిమా రాణి, అపర్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.



ఝాన్సీ లక్ష్మీబాయ్, ఇందిరాగాంధీ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

శాఖా గ్రంథాలయంలో మహిళా సాధికారతపై సదస్సు

నరసరావుపేట టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నరసరావుపేటలోని శాఖా గ్రంథాలయంలో బుధవారం మహిళా సాధికారతపై సదస్సు నిర్వహించారు. ముందుగా ఝాన్సీ లక్ష్మీబాయ్, దివంగత ప్రధాని ఇందిరా గాంధీ చిత్రపటాలకు నివాళి అర్పించారు. అనంతరం గ్రంథాలయ అధికారి యడ్లపాటి రాధ అధ్యక్షతన రంగోలి పోటీలు జరిగాయి.

● యడ్లపాడు: గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా జరిగిన కార్యక్రమంలో గ్రామ సచివాలయం-2 అధికారిణి శివపార్వతి పాల్గొని ముగ్గుల పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త కోమలి, టీడీపీ నాయకుడు పోపూరి రత్తయ్య, గ్రంథాలయఅధికారి చేవూరి అంజమ్మ పాల్గొన్నారు.

● శావల్యాపురం: సెంటర్లోని శాఖా గ్రంథాలయంలో బుధవారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జడ్పీ పాఠశాల ఆవరణలో బాలికలకు మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు గురుబాబు, కోటేశ్వరరావులు బాలబాలికలకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. విజేతలను హెచ్ఎం విజయలక్ష్మి, గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

● ఈపూరు: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఈపూరు, ముప్పాళ్ళ శాఖా గ్రంథాలయాల్లో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారులు గంట శ్రీనివాసరావు, ఎస్ నాగలక్ష్మి పాల్గొన్నారు.

● బొల్లాపల్లి: బొల్లాపల్లి గ్రంథాలయంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఏపీ మోడల్ స్కూల్‌లో బాలికలకు రంగవల్లులు, అల్లికల పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, అధికారి రామావత్ సేవా నాయక్, ఉపాధ్యాయులు మాధవి, శిరీష, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

● నరసరావుపేట రూరల్: మండలంలోని ఉప్పలపాడులోని గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు పరుగు పందెం, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రదానోపాధ్యాయులు సీహెచ్ నాగేశ్వరరావు, ఫిజికల్ డైరెక్టర్ కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు వెంకటప్పయ్య, మధుకుమార్, కృష్ణ పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం, ముగ్గుల పోటీలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు నార్నె జయలక్ష్మి, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తేళ్ల సుబ్బారావు పాల్గొన్నారు. పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో ఇందిరాగాంధీ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అగ్నిపథ్‌తో దేశ సేవ

● వింగ్ కమాండర్ షేక్ యాకుబ్‌అలీ



సమావేశంలో మాట్లాడుతున్న వింగ్ కమాండర్ షేక్ యాకుబ్‌అలీ

నరసరావుపేట టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దేశసేవకు అగ్నిపథ్ అద్భుత అవకాశం అని 12 ఎయిర్మెన్ సెలక్షన్ సెంటర్ వింగ్ కమాండర్ షేక్ యాకుబ్‌అలీ తెలిపారు. భారత వైమానిక దళంలో ఉద్యోగ అవకాశాలపై బుధవారం నరసరావుపేటలోని ఎస్ఎస్ఎన్ కాలేజీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిపథ్ పరీక్ష, అర్హతలు, జీతం, ఇతర ప్రయోజనాల గురించి విద్యార్థులు, యువతకు ఆయన వివరించారు. అగ్నివీర్ వాయు పథకంలో చేరిన వారు నాలుగేళ్ల దేశసేవ చేస్తారని, తర్వాత 25 శాతం మంది పర్మినెంట్ అవుతారన్నారు. ఆ నాలుగేళ్లలో గ్రాడ్యుయేషన్ కూడా పూర్తి చేసుకోవచ్చన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను భారత త్రివిధ దళాలలో చేరడానికి ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. డీఆర్వో మురళి మాట్లాడుతూ యువత ధైర్య సాహసాలకు, మేధస్సుకు, నైపుణ్యానికి అగ్నిపథ్ ఎంతగానో తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి షెకావత్‌ను కలిసిన జాస్తి

నరసరావుపేట కల్చరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర షెకావత్‌ను ఢిల్లీలో కలిసినట్లు అఖిల భారత పంచాయితీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షులు జాస్తి వీరాంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లండన్‌లోని బ్రిటీష్ మ్యూజియంలోని అమరావతి శిల్ప సంపదను తెప్పించేందుకు ఇటీవల భారత విదేశాంగ అదనపు కార్యదర్శి పియూష్ శ్రీవాస్తవ నుంచి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి వచ్చిన లేఖను కేంద్రమంత్రికి అందజేసినట్లు తెలిపారు. రాష్ట్ర పురావస్తు శాఖ త్వరగా ఈ విషయంలో స్పందించి, కేంద్ర విదేశాంగశాఖ అడిగిన వివరాలను పంపాలని పురావస్తు శాఖ కమిషనర్ ఆమ్రపాలి, పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్‌కు ఆయన విజ్ఞప్తి చేశారు.

ఘనంగా సహకార వారోత్సవాలు

ఈపూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత సహకార వారోత్సవాలను ఈపూరు సొసైటీలో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. కార్యాలయంలో జెండా ఆవిష్కరణ సొసైటీ చైర్మన్ విడవలపాటి హనుమయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ రాపర్ల జగ్గారావు, సొసైటీ మేనేజర్లు మహేష్, లోకేష్, సొసైటీ డైరెక్టర్లు ఐ.కోటేశ్వరరావు, నరసింహారావు, గోపువారిపాలెం సర్పంచ్ జి.శ్రీనివాసరావు, సొసైటీ సీఈవో పోక కోటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

సంపూర్ణ వ్యాధి నిర్మూలనకు కృషి

● జిల్లా కుష్ఠు, క్షయ నిర్మూలనాధికారి మాధవీలత



యడ్లపాడు ఎర్రచెరువు కాలనీలో మహిళను పరిశీలిస్తున్న జిల్లా లెప్రసీ, క్షయ నిర్మూలనాధికారి మాధవీలత

యడ్లపాడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా కుష్ఠు, క్షయ నిర్మూలనాధికారి డాక్టర్ యు.మాధవీలత బుధవారం యడ్లపాడులో పర్యటించారు. ముందుగా ఆరోగ్య కేంద్రం పరిధిలో జరుగుతున్న కుష్ఠు వ్యాధి అనుమానితుల సర్వే (ఎల్‌సీడీసీ) జరుగుతున్న తీరును పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ భరద్వాజ, డాక్టర్ ఎం.ప్రభాకరరావులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక ఎర్రచెరువు కాలనీలో జరుగుతున్న సర్వేను స్వయంగా పరిశీలించారు. కాలనీకి చెందిన పలువురిని పరీక్షించారు. సర్వేలో ఎవరైనా వ్యాధి లక్షణాలు కలిగిన వారిని గుర్తిస్తే పీహెచ్‌సీలో పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ చేసి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పీహెచ్‌సీ సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి 30 వరకు ఇంటింటికి సర్వే చేస్తున్నామన్నారు. అనంతరం యడ్లపాడు-1 ఆరోగ్య ఉపకేంద్రంలో జరుగుతున్న సర్వే ప్రగతిని, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు టైలరింగ్ కిట్లు, సర్టిఫికెట్లు పంపిణీ

నరసరావుపేట టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావిపాడులోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ అక్టోబరు 13న ప్రారంభమైన ఉమెన్స్ టైలరింగ్ కోర్సు పూర్తయిందని ఆర్ఎస్ఈటీఐ డైరెక్టర్ ఎస్.నీలోఫర్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా కోర్సు పూర్తిచేసిన మహిళలకు కిట్లు, సర్టిఫిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్.నీలోఫర్ ఉత్తీర్ణులైన మహిళలను అభినందించారు. ఈ నెల 24 నుంచి బ్యూటీషియన్ కోర్సు, డిసెంబరు 1 నుంచి మగ్గం వర్క్‌కోర్సు సెల్‌ఫోన్ రిపేరింగ్ కోర్సు, డీటీపీ కోర్సులను ప్రారంభిస్తున్నామన్నారు. అదనపు సమాచారం కోసం 08647-221916, 9703120524, 6300466010, 9493928134 నంబర్లను సంప్రదించాలన్నారు.

సచివాలయంలో మునిసిపల్ కమిషనర్ తనిఖీ



నరసరావుపేటలో 13వ సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న మునిసిపల్ కమిషనర్

నరసరావుపేట రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వార్డు సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తప్పనిసరిగా అటెండెన్స్ రిజిష్టర్, మూమెంట్ రిజిష్టర్‌లో హాజరు వేయాలని మునిసిపల్ కమిషనర్ జస్వంతరావు తెలిపారు. నరసరావుపేట పురపాలక సంఘం పరిధిలోని షాలెంనగర్‌లోని 13వ సచివాలయాన్ని బుధవారం మునిసిపల్ కమిషనర్ జస్వంతరావు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయంలోని అటెండెన్స్ రిజిష్టర్‌ను తనిఖీ చేసి కొంతమంది రిజిష్టర్‌లో సంతకాలు చేయకపోవడం గమనించి సిబ్బందిని హెచ్చరించారు. సచివాలయ కార్యదర్శులు తప్పనిసరిగా ఉదయం 10:30 గంటలకు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు.

ఎస్సీ కుటుంబాలకు చీఫ్ విప్ జీవీ సాయం



నివాసగృహాలను కోల్పోయిన బాధితులను పరామర్శిస్తున్న చీఫ్‌విప్ జీవీ

వినుకొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాలలపాలెంలో ఇటీవల ఇల్లు కూల్చివేతలో నష్టపోయిన ఎస్సీ కుటుంబాలను ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు బుధవారం పరామర్శించారు. వారికి ఆర్థికసాయం అందజేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని జీవీ స్పష్టం చేశారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అదనపు గదులు ప్రారంభం

వినుకొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్ఎస్పీ కాలనీలో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులను చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, లీలావతి దంపతులు మంగళవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ (1 వార్డు స్కూల్) పల్నాడు జిల్లాలోనే పెద్ద హైస్కూల్ అని 1350 మంది విద్యార్థులు ఉండగా తరగతి గదులు చాలక ఇబ్బందులు పడుతుండడంతో 8 అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం ప్రభుత్వం 1.20 కోట్లు నిధులు కేటాయించడం జరిగిందన్నారు. విద్యార్థులకు శుద్ధమైన తాగునీరు అందించేందుకు గంగినేని రామయ్య ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంఈవో జఫ్రుల్లా, పాఠశాల హెచ్ఎం పి.శైలజకుమారి, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● కారుమంచి ఎంపీటీసీ యూనిట్ ఇన్‌చార్జి హరిబాబు

కారుమంచి (శావల్యాపురం) నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాటూరి మెడికల్ కాలేజీ, హాస్పిటల్, కారుమంచి తెలుగు యువత ఆధ్వర్యంలో మండలంలోని కారుమంచి లైబ్రరీ సెంటర్లో గురువారం జరగనున్న మెగా వైద్య శిబిరాన్ని రోగులంతా సద్వినియోగం చేసుకోవాలని ఎంపీటీసీ యూనిట్ ఇన్‌చార్జి, సీనియర్ టీడీపీ నాయకులు కోటా హరిబాబు తెలిపారు. వైద్య శిబిరంలో రోగులకు కాటూరి మెడికల్ కళాశాలకు చెందిన వైద్యులు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు కూడా పంపిణీ చేస్తారన్నారు. వైద్యశిబిరానికి హాజరయ్యేవారు ఆధార్, ఫోన్ నెంబర్లు తీసుకురావాలన్నారు.